ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 6 ఆగస్టు 2024





కలెక్టర్ల సదస్సుకు హాజరైన ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్లు వెంకటమురళీ, అరుణ్‌బాబు, నాగలక్ష్మి

ప్రణాళికతో లక్ష్యాలు సాధించండి

- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కలెక్టర్ ఒక విజన్ 2047ని తయారు చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే ప్రతీ 100 రోజులకు ఒక కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ దిశగా లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రైవేటు ప్రభుత్వ భాగాస్వామ్యానికి హద్దు లేదన్నారు. ఏ విషయంలోనైనా ఈ విధానాన్ని అమలు చేయవచ్చని సూచించారు. కొత్త ఆలోచనలు చేసి పీపీపీ విధానాన్ని అమలు చేయాలన్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కొన్ని అంశాలపై సీఎం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు.

వెనకబడిన వర్గాలకు ఇళ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ. దీనిని కొనసాగించాలి. అలానే అర్హత ఉండి ఇంకా ఎవరైనా మిగిలిపోయి వుంటే వారిని కేంద్రం అమలు చేయబోతోన్న కొత్త పథకం కింద అర్హులుగా చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి సూచించారు. ఇళ్ల నిర్మాణానికి గ్రీన్‌ఛానెల్ ఏర్పాటు చేసుకొని అందుకు అవసరమైన ఇసుక, ఇనుము తదితర సామాగ్రి అంతా ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేయాలన్నారు. ప్రధానంగా రాబోయే 11 నెలలు ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. గుంటూరు జిల్లాకు పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ కింద 1,00,540 ఇళ్లు మంజూరైతే గత ఐదేళ్లలో కేవలం 23,176 మాత్రమే పూర్తి చేశారు. అసలు నిర్మాణమే ప్రారంభం కాని ఇళ్లు 36,404 ఉన్నాయి. పురోగతిలో మరో 40,958 ఉన్నాయి. గ్రౌండింగ్, స్టేజ్ కన్వర్షన్‌లో గుంటూరు జిల్లా బాగా వెనకబడి వుందన్నారు. అలానే మౌలిక సదుపాయాల కల్పనలోనూ వెనకంజలో ఉందని చెప్పారు. ఎవరైతే అనర్హులు, లబ్ధిదారుల జాబితాలో ఉన్నారో వారందరిని తీసేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని వారిని పిలిచి మాట్లాడి ఒకవేళ ఇల్లు కట్టుకోకపోతే భవిష్యత్తులో ఆ అవకాశాన్ని కోల్పోతారని చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త స్కీమ్ తీసుకు రాబోతో న్నదని, దీనికి రూ.4.30 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారన్నారు. అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్‌లో మూడు సెంట్లు ఇస్తామన్నారు. ఇప్పటి నుంచి వచ్చే దరఖాస్తులకు ఆ స్కీమ్ ద్వారానే లబ్ధి చేకూరుస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్‌లో ఉప కార్యక్రమమైన ఛాలెంజ్ బేస్డ్ డెస్టిని డెవలప్‌మెంట్(సీబీడీడీ) కింద నాగార్జునసాగర్‌లో పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరయ్యాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ జిల్లాలో ఒక ఆర్‌టీజీఎస్ సెంటర్‌ని 60 రోజుల వ్యవధిలో ఏర్పాటు చేయాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్‌కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గుంటూరు-బాపట్ల 42 కిలో మీటర్లు, మంగళగిరి - తెనాలి - నారాకోడూరు 40 కిలో మీటర్ల రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చే సేందుకు ప్రతిపాదించామన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న 50 ఎకరాల ఖాళీ స్థలాన్ని పీపీపీ విధా నంలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు వంటి వాటికి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశం ముగింపులో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో సీఎం సమావేశం నిర్వహించారు. సంపద సృష్టి జరగాలంటే తొలుత శాంతి భద్రతలు ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు సమన్వయంగా ముందుకుపోవాలి. నేను స్వతంత్రం అన్న ఆలోచన ఇద్దరిలోనూ కలగరాదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో సీసీ టీవీలు అమర్చాలి. అలానే ప్రైవేటు ప్రదేశాల్లో వాటి యజమానులతో సీసీ టీవీలు ఏర్పాటు చేయించి వాటిని ప్రభుత్వ సిస్టమ్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. గంజాయిని పూర్తిగా అదుపు చేయాల్సి ఉన్నది. ఇళ్లల్లోనూ వాటిని పెంచుతున్నారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి వాటిని పసిగట్టి ముందు ఉత్పత్తిని నియంత్రిస్తే ఆటోమేటిక్‌గా వాడకం అదుపులోకి వస్తుందన్నారు. సోషల్ మీడియాలో జరుగుతోన్న ఫేక్ ప్రచారాలను అరికట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాకు ఒక ఐటీ నిపుణుడిని పంపిస్తామన్నారు.

అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై కూడా...


జిల్లాలో పెద్ద సంఖ్యలో అసైన్డ్ భూములు ఉండడంతో గడచిన ఐదేళ్లలో వాటి విషయంలో జరిగిన అవకతవకలపై సీఎంతో సమావేశంలో చర్చకు రాగా వాటన్నింటిపై పూర్తి వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది. భూముల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారెవరు ఎంత వారైనా చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడవద్దని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం.

ఫేక్ ప్రచారంపై చర్చ

ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని దానికి ఉదాహరణగా తాజాగా బాపట్ల జిల్లా భట్టిప్రోలులో జరిగిన ఉదంతాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రస్తావించినట్లు సమాచారం. భట్టిప్రోలు ఘటనలో టీడీపీ కార్యకర్త ఒకరు ఎస్ఐ చొక్కా పట్టుకున్నట్లు జరిగిన ఫేక్ ప్రచారం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై మరుసటి రోజే ఆ తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ రేపల్లె డీఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేసిన విషయాన్ని కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సరైన ఆధారాల్లేకుండా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవనే సంకేతాన్ని ఇచ్చినట్లు జిల్లా అధికారులు సీఎంకి వివరించినట్లు తెలుస్తోంది. బాపట్ల, రేపల్లెలో తాగునీటి సమస్యలను నివారించడంతో పాటు బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం ప్రస్తుత పరిస్థితి, నిధుల లభ్యత పెండింగ్ తదితర అంశాలు కలెక్టర్ల సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది

ఇన్‌చార్జిల పాలనలో.. ఆర్టీసీ


- బాపట్ల ఇన్‌ఛార్జ్ డీపీటీవోగా గుంటూరు డీపీటీవో రవికాంత్
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు డిపోల్లోనూ ఇదే పరిస్థితి...
- ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించాలంటోన్న ఉద్యోగ సంఘాలు



గుంటూరు, ఆగస్టు 5: ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇన్‌చార్జ్‌ల పాలనలో నడుస్తోంది. కొన్ని రోజులుగా నాలుగు డిపోలకు రెగ్యులర్ డిపోల డీఎమ్‌లే ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తద్వారా పాలన కుంటుపడటంతో పాటు అధికారులు రాకపోకలతోనే సరిపోతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే నష్టాలతో కొట్టుమిట్టాడుతోన్న ఆర్టీసీ, ఇన్‌ఛార్జ్‌ల పాలనతో మరింత దిగజారే పరిస్థితి నెలకొందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విభజిత గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా వ్యవహరిస్తున్న ఎమ్ రవికాంత్ బాపట్ల జిల్లాకు ఇన్‌ఛార్జ్ డీపీటీవోగా వ్యవహరిస్తున్నారు. ఆర్టీసీ బాపట్ల జిల్లా పరిధిలో బాపట్లతో పాటు చీరాల, పర్చూరు, అద్దంకి డిపోలున్నాయి. గుంటూరు నుంచి బాపట్ల రాకపోకలు సాగించటంతో పాటు సమీక్షా సమావేశాలు నిర్వహించటం కూడా ఆయనకు తలకు మించిన భారంగా మారుతోంది. మరోవైపు గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎమ్)గా వ్యవహరిస్తున్న కె సత్యనారాయణను మంగళగిరి డిపో ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఏటీఎమ్ మంగళగిరి డిపో ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తుం డటంతో బస్టాండ్‌లో పర్యవేక్షణ లేకపోవటంతో కొందరు సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. జిల్లా కేంద్రం గుంటూరు బస్టాండ్‌లో ఏటీఎమ్ పోస్టు ఎంతో కీలకమైనది. బస్సుల పర్యవేక్షణతో పాటు వాణిజ్య సంబంధమైన పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఆయన ఇన్‌ఛార్జ్‌గా అక్కడే ఎక్కువ సమయం కేటాయించటంతో పాటు ఇక్కడ సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవటంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక తెనాలి డిపో మేనేజర్ ఏ రాజశేఖరనాయక్ రేపల్లె డిపో ఇన్‌ఛార్జ్ డీఎమ్‌గా వ్యవహరిస్తున్నారు. పొన్నూరు డిపో మేనేజర్ అజితకుమారి బాపట్ల డిపోకు ఇన్‌ఛార్జ్ డీఎమ్‌గా పనిచేస్తున్నారు. సత్తెనపల్లి డిపో మేనేజర్ జీవీఎస్ కుమార్ పిడుగురాళ్ళ డిపో ఇన్‌ఛార్జ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా ఇన్‌ఛార్జ్ మేనేజర్లతో డిపోలలో పాలన కూడా కుంటు పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డిపోలలో నిత్యం సిబ్బంది విధులతో పాటు పాలనా వ్యవహారాలు, రోజువారీ గ్రీవెన్స్ కూడా ఇబ్బందులు పడుతున్నట్లు ఆ శాఖ ఉద్యోగుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయా డిపోలలో మేనేజర్లు పదవీ విరమణ చేయటంతో ఖాళీ అయిన పోస్టుల్లో కొన్ని రోజులుగా ఇన్‌ఛార్జ్‌లతోనే నెట్టుకొస్తుండటం ఆర్టీసీలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం డీజీపీగా ఉన్న ద్వారకా తిరుమలరావు ఆర్టీసీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇలా ఆర్టీసీ ఇన్‌ఛార్జ్‌ల పాలనతో మరింత కుంటు పడుతుందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీ నెరవేరాలంటే ఇన్‌చార్జ్‌ల పాలన లేకుండా పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.





నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

తెరుచుకున్న సాగర్ గేట్లు

- 16 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- సాగర్‌కు కొనసాగుతున్న వరద ఉధృతి
- ఇన్‌ఫ్లో 3,23,331.. ఔట్‌ఫ్లో 1,63,220 క్యూసెక్కులు
- డ్యాం వద్ద పర్యాటకుల సందడి

నరసరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ నిండు కుండలా ఉంది. జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యాంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరడంతో 16 గేట్లు ఎత్తి దిగువకు 1.63 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణ కలెక్టర్ నారాయణ రెడ్డి, జలవనరుల శాఖ సీఈ నాగేశ్వరరావు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి మొత్తం 16 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రాత్రి 7 గంటలకు 3,23,610 క్యూసెక్కుల వరద నీరు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 584.20 అడుగులకు నీటి మట్టం చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు గాను 295.12 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా 1,63,332 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 40,516 కూసెక్కులు మొత్తం 2,03,848 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని విడుదల చేయడంతో జలాశయం దిగువ ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. నదీ తీరం వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు చర్యలు తీసుకున్నాయి. సాగర్ నుంచి నీటి విడుదల మంగళవారానికి మరింత పెరగుతుందని అధికారులు తెలిపారు.



స్విచ్ఛాన్ చేసి క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభిస్తున్న సీఈ నాగేశ్వరరావు

పులిచింతలకు కృష్ణమ్మ పరవళ్లు

కెఎల్‌రావు పులిచింతల ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ నుంచి విడుదల చేస్తున్న వరద పులిచింతలకు చేరుతోంది. మంగళవారం కల్లా పులిచింతలకు 2.03 లక్షల క్యూసెక్కుల వరద చేరనుంది. ఇక్కడ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజ్‌కు 26,083 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 130.15 అడుగులకు నీటి మట్టం చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 6.68 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రెండు రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.



నేతన్న కోసం.. చంద్రన్న

- రేపే చీరాలకు చంద్రబాబు రాక
- చేనేత దినోత్సవ కార్యక్రమానికి హాజరు

చీరాల, ఆగస్టు 5 : జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు రేపు చీరాల వస్తున్నారు. దీనికి కావలసిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేస్తున్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం చేనేతను పట్టించుకోక పోవడంతో నిర్వీర్యం అయింది. సీఎం రాకతో అయిన తమ దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావాన్ని నేతన్నలు వ్యక్తపరుస్తున్నారు.

వేటపాలెం మండలం నాయినిపల్లి వద్ద 2005లో టెక్స్‌టైల్ పార్కు కోసం సుమారు 50 ఎకరాలు స్థలం కేటాయించారు. అప్పటి మంత్రి కొణిజేటి రోశయ్య శంకుస్థాపన చేశారు. అయితే టెక్స్‌టైల్ పార్కు కన్నా చేనేత పార్కు అయితేనే ఉపయోగమని పలువురు చేనేత రంగ ప్రతినిధులు తెలిపిన అభ్యంతరాలతో దాన్ని 2008లో చేనేత పార్కుగా మార్చారు. ఇదిలా ఉంటే కేటాయించిన స్థలంలో సుమారు 23 ఎకరాల స్థలం ఇతర అవసరాలకు కేటాయించారు. ప్రస్తుతం 26.81 ఎకరాలు స్థలం ఉంది. అందులో చేనేత పార్కు కోసం రూ.9 కోట్లు అంచనా వ్యయంతో కేంద్ర ప్రభుత్వానికి ఎంఎస్‌ఎంఇ(మైక్రో, స్మాల్, మీడియం, ఎంటర్‌ప్రైజెస్)కింద డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను స్థానిక హ్యాండ్లూమ్ ఏడీ కార్యాలయం నుంచి పంపారు. ప్రస్తుతం అది ఆమోదం పొందాల్సి ఉంది. దీంతో పాటు కోర్టు వివాదం కూడా కొంత ఉంది. అది కూడా పూర్తి పరిష్కారం కావాల్సిన అవసరం ఉంది. తొలివిడతగా మంజూరు చేసిన నిధులను అప్పటి ఏడీ సత్యన్నారాయణరాజు దుర్వినియోగం చేశాడు. విచారణ కొనసాగుతోంది. రికవరీ జరగలేదు.

కాగితాలకు పరిమితమైన క్లస్టర్లు

నేతన్నల అభ్యున్నతికి, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నిర్మించిన క్లస్టర్ల ప్రయోజనం కాగితాలకే పరిమితం అయ్యింది. నియోజవర్గ పరిధిలో గతంలో నిర్మించిన మెగా క్లస్టర్ నేడు నిరుపయోగంగా ఉంది. ఆ తరువాత ఇంటిగ్రేటెడ్ క్లస్టర్లుపేరుతో నిర్మించిన క్లస్టర్లు లక్ష్యానికి దూరంగానే ఉన్నాయి.



11 రకాల రిజర్వేషన్ అమలు శూన్యం

నేతన్నలు మాత్రమే తయారు చేయాలని 11 రకాల చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక చట్టం ఉంది. అయితే అది అమలు కావటం లేదు. పవర్‌లూమ్ వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చెలామణి అవుతున్నాయి. వారిని అరికట్టాల్సిన విజిలెన్స్ అధికారులు కన్నులకు కనిపించరు.

సహకార సంఘాల్లో లోపించిన సహకారం

చేనేత సహకార సంఘాల్లో సగటు కార్మికులకు సహకారం లభించటం లేదు. సంఘాల పాలకవర్గాలకు చెందిన వ్యక్తులు, వారి కనుసన్నల్లో ఉండే వారి పేర్లు మాత్రమే రికార్డుల్లో ఉంటాయి. ఇతర మగ్గాలపై నేసిన వస్త్రాలను పలువురు సంఘాల్లో నేసినట్లు ఆప్కోకు విక్రయిస్తూ వచ్చే ఆదాయం పక్కతోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పేరుకు పోయిన నిల్వలు

చేనేత వస్త్రాలను ఎప్పుడు కూడా వినియోగదారుల అభిరుచిమేరకు తయారు చేయాలి. అప్పుడే మార్కెట్ ఉంటుంది. చేనేత రంగం సంక్షోభానికి కరోనా కూడా ఓ కారణం. తరువాత రంగులు, రసాయనాలు, నూలు ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అయినా వ్యయప్రయాలసల కోర్చి వస్త్రాలు తయారు చేసిన వారి నుంచి కొనుగోళ్లు నిలిచి పోయాయి. దీంతో భారీగా నిల్వలు పేరుకుపో యాయి. వాటిని వెంటనే కొనుగోలు చేయించాల్సిన అవసరం ఉంది.

కుప్పడంకు భౌగోళిక గుర్తింపు

2018లో చంద్రబాబు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల వచ్చారు. ఆసందర్భంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమ సభలో చంద్రబాబును కలిసిన పలువురు నేతన్న ప్రతినిధులు కుప్పడంకు భౌగోళిక గుర్తింపు ఇవ్వాలని కోరారు. అందుకు తగిన చర్యలు చేపడతామని చెప్పారు. అది కార్యరూపం దాల్చాల్సి ఉంది. మొత్తం మీద అన్ని సమస్య లకు సీఎం చంద్రబాబు ప్రాధాన్య క్రమంలో పరిష్కారం చూపగలరని నేతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన

సీఎం చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం అధికారులు పరిశీలిం చారు. చీరాల వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాల ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి తదిత రులు పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.



వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాల ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జేసీ సుబ్బారావు, ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి తదితరులు

వరద ప్రభావిత గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు

- గ్రామాల వారీగా కుటుంబ వివరాలు నమోదు చేయాలి
- కృష్ణానదికి పెరగనున్నవరదనీరు
- ఆర్డీవో హేలా షారోన్

కొల్లూరు, ఆగస్టు 5: వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో హేలాషారోన్ సూచించారు. సోమవారం ఆర్డీవో కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పొంచి ఉన్న వరద ముంపు గురించి వారికి వివరించారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలు లేదా అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తారన్నారు. వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. వరద నీటి ఉధృతికి రోడ్లు, వంతెనలు దెబ్బతింటాయని, ఆ సమయంలో ప్రజలు వాటిని దాటే ప్రయత్నాలను పోలీసులు దగ్గరుండి నిరోధించాలన్నారు. వరద వల్ల ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లకూడదని, అందుకు సంబంధించిన జాగ్రత్తలు ముందుగా నే చూసుకోవాలన్నారు. గ్రామస్థులను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేయాలని, మర పడవలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తమ దగ్గర ఉన్న సమాచారం మేరకు గర్భిణులు, చిన్నారులు, మంచంలో ఉన్న వారు, 70 ఏళ్ల దాటిన వృద్ధులను ముందుగానే పునరావాస కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో సాధారణ మందులతో పాటు పాము కాటునివారణకు వినియోగించే మందులు, ఇంజక్షన్లు కూడా అందుబాటులో ఉంచు కోవాలని చెప్పారు. మూగజీవాల ప్రాణాలు కూడా కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు.

మత్స్యకారులతో సమావేశం..

వరద సమయంలో గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు మత్స్యకారులతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎఫ్‌టీవో హిమజలు సమావేశం నిర్వహించారు. వరద విపత్తు నుంచి ప్రజలను రక్షించేందుకు అవసరమైన పడవలు మత్స్యకారులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మొత్తం వారి వద్ద పడవల గురించి ఆరా తీశారు. ఆయా వివరాలను ఆర్డీవోకు సమర్పించి మీకు కావాల్సినవి కల్పిస్తామని, ఒక్కొక్క గ్రామానికి రెండు పడవలు చొప్పున ఏర్పాటు చేయాలని తహసీల్దార్ మత్స్యకారులకు సూచించారు.



పెదలంక గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో హేలాషారోన్

దిక్సూచి DIKSUCHI

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్



ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అర్హతలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్ధ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఆఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు



దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్ పీవో/ఎంటీ- XIV) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఆగస్టు 21. వెబ్‌సైట్: https://ibps.in/

- సీఆర్‌పీ ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ - XIV

ఖాళీలు: 4,455(ఎస్సీ-675, ఎస్టీ-332, ఓబీసీ-1185, ఈడబ్ల్యూఎస్-435, యూఆర్-1846)

ఖాళీలున్న ప్రభుత్వరంగ బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులు

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి

4455 ఖాళీలు

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; ఇతరులు రూ.850 చెల్లించాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువ పత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

మెయిన్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్): ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), రీజనింగ్ నుంచి 35 ప్రశ్నలు(35 మార్కులు) ఇస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్న పత్రం ఉంటుంది. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్/డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో మొత్తం 155 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే): 2 ప్రశ్నలు ఇస్తారు. 25 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షకు నిర్దేశించిన సమయం 30 నిమిషాలు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WP5N39qలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. సోమవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. 'చుట్టమల్లె' అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, అద్భుతమైన విజువల్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, శిల్పా రావ్ ఆలపించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం, బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ అందించారు. కాగా, 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

పతాక సన్నివేశాల చిత్రీకరణ




అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. డైరెక్టర్ సుకుమార్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సీక్వెల్‌ను 'పుష్ప పార్ట్ 1'ను మించి ఉండేలా ప్రతీ విషయంలో జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. చిత్రీకరణను దాదాపు పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం, ఈ సినిమాకు సంబంధించిన క్లైమాక్స్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. ఈ సెట్‌లో అల్లు అర్జున్‌తో పాటు ఇతర కీలక తారాగణం పాల్గొంది. ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థియేటర్స్‌లో గూస్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

మళ్లీ కలసి నటిస్తారా?



ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న 'స్పిరిట్' చిత్రం స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయింది. ఈ ఏడాది చివరిలో షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరా అనే చర్చ చాలా రోజులుగా జరుగుతోంది. తాజాగా త్రిష పేరు వినిపిస్తోంది. ఆమెతో దర్శకుడు సందీప్ మాట్లాడారనీ, ఆమె కూడా ఓకే చెప్పారనీ సమాచారం. ప్రభాస్, త్రిష కాంబినేషన్‌లో 'వర్షం', 'పౌర్ణమి', 'బుజ్జిగాడు' చిత్రాలు వచ్చాయి. 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ జంట 'స్పిరిట్' లో కలసి నటించనున్నారన్నమాట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో త్రిష నటిస్తున్నారు.

రెండు భాగాలుగా విజయ్ సినిమా



విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వీడీ 12'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సూర్య దేవరనాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాలో విజయ్ లుక్‌ను రిలీజ్ చేశారు. కంప్లీట్ రఫ్ లుక్‌లో ఉన్న విజయ్‌ను చూసి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అని అభిమానులు సినిమాపై అంచనాలు పెంచేసుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో చిత్ర నిర్మాత ఈ సినిమా ఓ గురించి ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. "గౌతమ్ తిన్ననూరి, విజయ్ కలయికలో తెరకెక్కే సినిమా కోసం దర్శకుడు అద్భుతమైన కథను రాసుకున్నారు. రెండు భాగాలకూ సరిపడా కంటెంట్ ఆయన రాసిన కథలో ఉంది . మొదటి భాగం ఫలితాన్ని బట్టి రెండో భాగం తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తాం" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 28న విడుదల కానుంది.




సినిమా చెట్టు నేలకు ఒరిగింది

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది.' అంటూ అక్కినేని,సావిత్రి జంటగా నటించిన మూగ మనసులు' (1964) చిత్రంలో జమున పాడిన పాట మీకు గుర్తుంది కదూ. ఆ పాట ఎక్కడ తీశారో తెలుసా? తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న చెట్టు, పరిసర ప్రాంతాల్లో. అప్పటినుంచి దశాబ్దాలుగా ఈ వృక్షరాజం నీడన ఎన్నో చిత్రాల షూటింగ్స్ జరిగాయి. హీరో కృష్ణ నటించిన 'పాడిపంటలు', చిత్రంలో 'ఇరుసులేని బండి.. ఈశ్వరుని బండి' పాటలోనూ ఈ చెట్టు ప్రముఖంగా కనిపిస్తుంది. అక్కినేని నటించిన 'సీతారామయ్య గారి మనవరాలు' చిత్రంలో 'సమయానికి తగు మాటలాడి' పాటను కూడా ఈ చెట్టు దగ్గరే చిత్రీకరించారు. కళాతపస్వి విశ్వనాథ్ రూపొందించిన 'శంకరాభరణం' నుంచి లేటెస్ట్‌గా రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' చిత్రం వరకూ మొత్తం 108 చిత్రాల్లోనూ కనిపించి, తనదైన పాత్ర పోషించింది. అగ్ర దర్శకులు, దాసరి, కె.రాఘవేంద్రరావు, జంధ్యాల, ఈవీవీ.. ఈ చెట్టు చుట్టూ తిరిగిన వారే. తమ సినిమాల్లో ఒక్క సీన్ అన్నా అక్కడ తీసే వారు. ఇక దర్శకుడు వంశీ సంగతి చెప్పనక్కర్లేదు. మొత్తం 18 చిత్రాల షూటింగ్స్‌ను ఆయన ఈ చెట్టు దగ్గరే తీశారు. ఈ ప్రాంతానికి వస్తే వంశీ తన మిత్రులతో కలిసి ఈ చెట్టు కింద కూర్చుని భోజనం కూడా చేసేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అలా కాలక్రమంలో ఈ చెట్టుకు 'సినిమా చెట్టు' అనే పేరు వచ్చింది. ఈ చెట్టు వద్ద సినిమాలో ఒక్క షాట్ తీసినా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం సినీ పరిశ్రమలో ఉంది అందుకే అగ్ర హీరోలు, దర్శకులు ఇక్కడి వచ్చి తమ సినిమాల్లో ఏదో ఒక సన్నివేశంలో 'సినిమా చెట్టు' కనిపించాలని ప్లాన్ చేసేవారు. మధ్యాహ్నం వేళలో ఈ చెట్టు కొమ్మలకు ఊయల కట్టి ఊగుతుంటే కింద గలగల పారే గోదావరి, చుట్టూ ప్రశాంత వాతావరణం... తన్మయత్వంతో శరీరం పులకరించిపోతుంది.

ఇంత చరిత్ర కలిగిన ఈ చెట్టు ఇప్పుడు నేలకొరిగింది. గోదావరి వరదలు, అధిక వర్షాలకు చెట్టు రెండుగా చీలి నేలకూలింది. గోదావరి వరద ఉధృతి వల్ల సినిమా చెట్టుకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ వలయం ఏర్పాటు చేసి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఎన్నో సార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరకు అందరూ ఊహించినట్లుగానే జరిగింది. సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు నేలకు ఒరిగిపోయింది.

నూట యాభై సంవత్సరాల చరిత్ర



ఈ సినిమా చెట్టు చరిత్ర, సెంటిమెంటు మాటల్లో చెప్పలేనిది. 150 సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన శింగలూరి తాతబ్బాయి అనే వ్యక్తి నిద్ర గన్నేరు చెట్టు (సినిమా చెట్టు) నాటినట్లు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ చెట్టును కుమారదేవం గ్రామ ప్రజలు సంరక్షించుకుంటూ వస్తున్నారు. గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా ఏటిగట్టు కోతకు గురవుతుంది. ఆ కోత చెట్టుకు ముప్పుగా మారింది. గత జూలై నెల 19వ తేదీ నుంచి గోదావరి నదికి వచ్చిన వరదలు, అధిక వర్షాలకు ఏటిగట్టు నానిపోయి ఉంది. దీంతో సోమవారం తెల్లవారు జామున సినిమా చెట్టు రెండు ముక్కలుగా వీడి కూలిపోయింది. ఇది నిద్ర గన్నేరు చెట్టు అయినప్పటికీ దీని కొమ్మలు గోదావరిలోకి పెరిగి ఉంటాయి. గోదావరి వరద పోటు, అధిక వర్షాలవల్లే ఈ చెట్టు కూలిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సినిమావాళ్లకు సెంటిమెంటుగా మారి గ్రామానికి పేరు తెచ్చిన ఈ చెట్టును కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నో వరదల్ని, తుపానుల్ని తట్టుకుని తరతరాలను చూసుకుంటూ కుమారదేవం గ్రామానికి ఎంతో గుర్తింపు తెచ్చిన ఈ సినిమా చెట్టు కూలిపోవడం ప్రకృతి ప్రేమికులను, గ్రామస్థులను ఆవేదనకు గురిచేస్తోంది.

కొవ్వూరు, (ఆంధ్రజ్యోతి)

ఆప్ ప్రభుత్వానికి సుప్రీం షాక్

ఎంసీడీలో నామినేటెడ్ సభ్యుల నియామక అధికారం ఎల్జీకే

- మంత్రిమండలి సలహాను పాటించనక్కర్లేదన్న ధర్మాసనం



న్యూఢిల్లీ/చెన్నై, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద దెబ్బ తగిలింది. చట్టం ప్రకారం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)లో సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కే ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ విషయంలో రాష్ట్ర మంత్రిమండలి సలహా, సూచనలను ఎల్జీ పట్టించుకోనవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసరం సోమవారం తీర్పు చెప్పింది. 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై విచారణను 15 నెలల క్రితమే పూర్తిచేసిన సుప్రీంకోర్టు అప్పుడు రిజర్వు చేసిన తీర్పును తాజాగా వెల్లడించింది. ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను ఎంసీడీకి నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి కల్పిస్తూ 1993లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1957కు సవరణలు చేశారని ధర్మాసనం తెలిపింది. ఎంసీడీలో 250 మంది ఎన్నికైన, 10 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారు. 2022 డిసెంబరులో జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. మెజారిటీ మార్కు 126 స్థానాలు కాగా, ఆప్ 134, బీజేపీ 104, కాంగ్రెస్ 9 స్థానాలు గెలుపొందాయి. అనంతరం 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయగా, మంత్రిమండలి సూచించిన వ్యక్తులను ఎల్జీ నామినేట్ చేసేలా ఆదేశించాలని కోరుతూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. కాగా, ఎంసీడీలో సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన స్థానిక సంస్థను ఆయన అస్థిర పరిచే అవకాశం ఉందని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, తాజా తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆప్ పేర్కొంది. విచారణ సందర్భంగా సీజేఐ, జడ్జిలు చేసిన వ్యాఖ్యలకు ఈ తీర్పు పూర్తి భిన్నంగా ఉందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

యూట్యూబ్ ఛానళ్ల నియంత్రణకు మద్రాస్ హైకోర్టులో పిల్

యూట్యూబ్ చానళ్ల నియంత్రణకు తగిన విధివిధానాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. చెన్నైకి చెందిన పార్తీబన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌లో.. యూట్యూబ్ ఛానళ్లను నియంత్రించే విధానం లేకపోవడంతో ఆయా ఛానళ్లు క్రిమినల్ కేసులపై ఇష్టానుసారంగా ప్రసారం చేస్తున్నాయని, ఇది పోలీసుల విచారణపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఈ ఛానళ్ల నియంత్రణకు విధివిధానాలు రూపొందించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు.

అభ్యర్థిత్వం రద్దుపై ఢిల్లీ హైకోర్టుకు ఖేద్కర్

వివాదాస్పద మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె సమర్పించిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. పూజా ఖేద్కర్.. మోసపూరితంగా ఓబీసీ, వికలాంగుల కోటాలో ఉద్యోగం పొందినట్లు ఆరోపణల నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు యూపీఎస్సీ ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే.

మృత్యు కుహరాలుగా కోచింగ్ సెంటర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలుగా మారాయని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అవి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించింది. పాత రాజేందర్‌నగర్‌లోని రావ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లో వరదల కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించిన ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. కోచింగ్ సెంటర్లలో భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఆదేశించింది. ఈ దుర్ఘటన అందరికీ కనువిప్పు కావాలని ఆకాంక్షించింది. మరోవైపు అన్ని కోచింగ్ సెంటర్లను తనిఖీ చేయాలంటూ 2023లో ఢిల్లీ హైకోర్టు అగ్నిమాపక శాఖను ఆదేశించడాన్ని సవాలు చేస్తూ కోచింగ్ సెంటర్ల అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ధర్మాసనం పరిశీలించింది. ఇది పసలేని పిటిషన్ అని పేర్కొంటూ రూ.లక్ష జరిమానా విధించింది.

సీఎంగా ఉన్నప్పటి భద్రత ఇవ్వండి

- వ్యక్తిగత రక్షణ అధికారులను ఇవ్వాలి..
- హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్



అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని.. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు పర్సనల్ సెక్యూరిటీ అధికారులు(పీఎస్‌వోలు), కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్‌ను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నిఘా విభాగం ఐజీ, గుంటూరు ఎస్పీ, రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. "2019లో విశాఖ ఎయిర్ పోర్టులో నాపై కోడికత్తితో దాడి జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి కాక ముందే నాకు ఉన్నత స్థాయి భద్రత కల్పించారు. నేను సీఎం అయ్యాక జడ్ ప్లస్ కేటగిరీ కింద 139 మందితో రక్షణ కల్పించారు. 2024 ఎన్నికల ఫలితాలు ప్రకటించి నెల గడవకముందే నాకున్న భద్రతా సిబ్బంది సంఖ్యను 59కి తగ్గించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రక్షణ తగ్గించడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమే. ఎన్నికల ప్రచారంలో నాపై రాయితో దాడి చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నా ఇల్లు, కార్యాలయం వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం నాకు ఇద్దరు పీఎస్‌వోలు మాత్రమే ఉన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలకు నాకంటే ఎక్కువ మంది పీఎస్‌వోలను ఇచ్చారు. పోలీసులు నాకిచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా ప్రయాణానికి అనుకూలంగా లేదు. అందులో ఏసీ పనిచేయడం లేదు. ఈ కారణంగా ఇటీవల ఓ పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకోవలసి వచ్చింది. నన్ను భౌతికంగా లేకుండా చేస్తామని అధికార కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచుతున్నాను. సీఎం హోదాలో నాకున్న జడ్ ప్లస్ భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 7న కేంద్ర హోం శాఖకు వినతి సమర్పించాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జూన్ 3 వరకు నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి' అని జగన్ పిటిషన్‌లో కోరారు.

మూఢాలు పోయాయి... పెళ్లి ముహూర్తాలు వచ్చేశాయి

- రేపటి నుంచి 28 వరకూ...
- 11, 18 తేదీల్లోనే అత్యధిక పెళ్లిళ్లు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పరస్పరం నచ్చేసి.. నిశ్చితార్థం కూడా జరిగిపోయి పెళ్లి కోసం ఎదురు చూస్తున్న అమ్మాయి, అబ్బాయిల కోసం శుభ ముహూర్తాలు వచ్చేశాయ్! ఆ ఇళ్లలో ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. ముహూర్తాల కోసం వెళితే.. 'శుభ శ్రావణ మాసం.. శుభస్య శీఘ్రం' అంటూ పంతులు గారు మంచి రోజు నిర్ణయించేస్తారు! ఈ నెల.. అంటే ఆగస్టు 7 నుంచి 28 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. పైగా మూడు నెలల తర్వాత వచ్చిన శుభ ఘడియలు! ఇవి తప్పిపోతే.. మళ్లీ అక్టోబరు 13 దాకా ముహూర్తాలే లేవు. దీంతో 7-28 తేదీల మధ్య తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆగస్టు 7న శుభ ముహూర్తాలు మొదలవనుండగా.. పెళ్లిళ్లు మాత్రం 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26న చైత్ర మాసంతో పాటు శుక్ర, గురు మూఢాలు మొదలయ్యాయి. తర్వాత వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ (మే, జూన్, జూలై)మాసాలు కావడంతో ముహూర్తాలు లేవు. అంటే.. ఈ ఏడాది ఏప్రిల్ 26 నుంచి వివాహాలకు అనువైన ముహూర్తాలు లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్ వ్యాపారులకు పెద్దగా వ్యాపారం లేకుండా పోయింది. ఇప్పుడైతే ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారంతా ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్స్ బుక్ చేసుకున్నారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. అయితే అక్టోబరు 13 దాకా ఆగితే అక్కడి నుంచి వచ్చే ఉగాది దాకా పెళ్లి ముహూర్తాలే ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆగస్టులో దాదాపు 10 రోజుల పాటు మంచి ముహూర్తాలున్నా.. వాటిలో 11, 18 తేదీల్లో వివాహాలు ఎక్కువగా జరగనున్నాయి. 11వ తేదీ ఆదివారం, స్వాతి నక్షత్రం, సప్తమి రావడంతో ఇది చాలా విశేషమైన రోజుగా పరిగణిస్తారు. 18వ తేదీ కూడా ఆదివారం, శ్రవణ నక్షత్రం, చతుర్దశితో పాటు పౌర్ణమి రావడంతో విశిష్టమైన రోజుగా పండితులు చెబుతుండడంతో ఈ రోజున ఉండే ముహూర్తానికి కూడా మరింత డిమాండ్ ఉంది. అయితే ఈనెల 9న, ఆగస్టు 28న కూడా పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయి.

ఉపాధి కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ

నకరికల్లు, ఆగస్టు 5: నిరుద్యోగ యువతీ యువకులకు రిఫ్రిజరేషన్ ఎయిర్ కండిషన్ సర్వీస్ కోర్సులో యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ తెలిపారు. అలాగే కంప్యూటర్ ట్యాలీ, అకౌంటింగ్ కోర్సులోను ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆయన వివరించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అభ్యర్థులు పది పాస్ లేదా ఫెయిల్ అయినవారు 19 నుంచి 45 సంవత్సరాలు వయసు ఉన్నవారు ఇందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు తెల్లరేషన్‌కార్డు కాపీ, ఆధార్‌కార్డ్ జిరాక్స్, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, 10వ తరగతి పాసు లేదా ఫెయిల్ సర్టిఫికెట్ జిరాక్స్‌తో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, డోర్ నం.14-1-14, ఓల్డ్‌బ్యాంకు స్ట్రీట్, కొత్తపేట, గుంటూరులో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 97006 87696, 81253 97953, 99499 30155 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలు

తెనాలి అర్బన్, ఆగస్టు 5: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్.చినవెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 26 లోగా అభ్యర్థులు దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా కానీ, నమోదు కేంద్రంలోగాని నమోదు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రైవేట్ ఐటీఐలో 570 ఖాళీలు ఉన్నాయని, 29న కౌన్సెలింగ్‌కు ప్రభుత్వ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తెనాలి ఐటీఐలో సంప్రదించాలని చెప్పారు. ప్రైవేట్ ఐటీఐలో కౌన్సెలింగ్ కోసం ఈ నెల 31న హాజరు కావాలన్నారు. ఏ ఐటీఐలో చేరదలుచుకున్నారో ఆ ఐటీఐకి మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు.

అమ్యామ్యాల అంగన్వాడీ

- పాలప్యాకెట్లకు రెక్కలు.. కోడిగుడ్లకు కాళ్ళు
- మెడికల్ లీవులకు ముడుపులు ఇవ్వాల్సిందే
- సూపర్‌వైజర్ల కనుసన్నల్లో సీడీపీఓలు



గుంటూరు సిటీ, ఆగస్టు 5: గుంటూరు జిల్లాలోని అంగన్వాడీల్లో అవినీతి రాజ్యమేలుతోంది. అడిగేవారు లేరన్న ధీమాతో కొందరు సూపర్‌వైజర్లు, సీడీపీఓలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రోజు రోజుకు వారి ఆగడాలు పెచ్చుమీరటంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు విచారణ కు ఆదేశించారు. జిల్లా అధికారులు చేపట్టిన చర్యలు తూతూ మంత్రమేనని బాధితులు చెబుతున్నారు. కొందరు సూపర్‌వైజర్లకు సెక్టార్లు మార్చినా లోతైన విచారణ జరిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. తలా పాపం తిలా పిడికెడు అన్న చందంగా ఈ మొత్తం వ్యవహారంలో సీడీపీఓల పాత్ర కీలకం అని చెబుతున్నారు. జిల్లాలోని ఆరు ప్రాజెక్టులు, 55 సెక్టార్లలో అవినీతి వ్యవస్థీకృతం అయ్యిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకూ పలు ప్రభుత్వ శాఖలో చోటుచేసుకున్న అక్రమాలు కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. పోషకలోపంతో అల్లాడుతున్న తల్లీపిల్లల పోషకాహారాన్ని సైతం కైంకర్యం చేస్తున్న అక్రమార్కుల గుట్టు రట్టవుతోంది. అంగన్వాడీ కేంద్రాలను గాడిలో పెట్టాల్సిన అధికారులే మామూళ్ల రుచిమరిగి అవకతవకలను ప్రోత్సహిస్తున్న ఘటనలు తాజా విచారణలో బయట పడుతున్నాయి. అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నాయి.

తీగలాగితే కదిలిన డొంక

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారులు వ్యవస్థలను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో క్షేత్రస్థాయిలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. లబ్ధిదారులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి కూడా లేకపోవడంతో బాధితులు ఫిర్యాదులు చేయడం కూడా అనవసరమనే పరిస్థితి ఏర్పడింది. దీంతో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకూ అందరూ ఒక్కటై అంగన్వాడీలను దోపిడీ చేసేపనిలో పడ్డారు. తాజాగా కూటమి ప్రభుత్వం రాకతో అధికారులకు అక్రమాలపై ఫిర్యాదులు అందాయి. దానిపై జిల్లాస్థాయి అధికారులు చూసీచూడనట్టు వదిలేసినా, పైస్థాయి అధికారులు విచారణ జరిపించారు. విచారణలో విస్తుగొలిపే అంశాలు బయటపడ్డాయి. కేవలం ఒక అంశంపై విచారణ చేపట్టిన అధికారులు తీగ లాగితే డొంకంతా కదిలింది. అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన విచారణ ఐసీడీఎస్ సీడీపీవో స్థాయి అధికారుల వరకూ చేరింది. దీంతో అధికారులు విచారణను మరింత వేగవంతం చేశారు.

పాల ప్యాకెట్లు దారి మళ్లింపు

గుంటూరు నగరంలో ఒక అంగన్వాడీ సూపర్‌వైజర్ తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన పాల ప్యాకెట్లను దారి మళ్లించి, రూ.80వేలు సొమ్ము చేసుకున్నారు. అయితే అవి అంగన్వాడీ కేంద్రాలకు అందినట్లు కార్యకర్తల నుంచి సంతకాలు తీసుకున్నారు. పాల ప్యాకెట్లు రాలేదని అడిగితే ప్రభుత్వం పంపలేదని బుకాయించి తప్పించుకోజూశారు. దీనిపై లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. జోనల్ అధికారుల జోక్యంతో విచారణ చేపట్టారు. ఆ విచారణలో అనేక విషయాలు వెలుగు చూశాయి. విచారణ అధికారుల ముందు కార్యకర్తలు అనేక అంశాలను బయటపెట్టారు.

కోడిగుడ్లదీ అదే పరిస్థితి..

కొన్ని కేంద్రాలకు కోడిగుడ్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు యాప్‌లో సమాచారం నమోదుచేసినట్లు తెలుస్తోంది. వివిధ కారణాలతో గర్భిణీ, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారంలో కోతలు పెడుతున్నారు. మిగిలిన వాటిని పక్కకు తప్పిస్తున్నారు. ఇందులో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం అని తెలుస్తోంది. లబ్ధిదారుల ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) ఆధారంగా పోషణ ఇస్తున్నప్పటికీ అక్రమాలకుదారులు వెతికారు.

మెడికల్ లీవ్ కావాలంటే కాసులివ్వాల్సిందే!

అంగన్వాడీ ఉద్యోగులకు మెడికల్ లీవ్ ఇవ్వాలంటే వారు కాసులు ఇవ్వాల్సిందే. ఒక్కో అధికారి సెలవులు మంజూరు చేసేందుకు రూ.5 వేలు డిమాండ్ చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చాలామంది ఇలా లంచాలు సమర్పించుకున్నారు.

నెలవారీ వసూళ్లు

మరో అంగన్వాడీ సూపర్‌వైజర్ అంగన్వాడీ కార్యకర్త ఇంట్లోనే మకాం పెట్టారు. ఆ కార్యకర్త ద్వారా ఆమె వసూళ్ల పర్వం మొదలు పెట్టారు. డబ్బులు ఇవ్వడానికి నిరాకరించినవారితో తనిఖీల పేరుతో భయపెట్టి మరీ దండుకుని ఇద్దరూ పంచుకుంటున్నారు.

యూనిఫామ్ వంకతో వసూళ్లు

అంగన్వాడీ సిబ్బంది విధులకు హాజరైనప్పుడు యూనిఫామ్ ధరించాలి. అలా యూనిఫామ్ వేసుకోకుండా చీరలతో వచ్చి విధులకు హాజరైతే వాటి విషయంలో కూడా సూపర్‌వైజర్‌లు వసూళ్లకు పాల్పడుతున్నారు. మరికొందరు అంగన్వాడీ సిబ్బంది పొరపాటున ఏవైనా తప్పులు చేస్తే వాటిని రికార్డుల్లో రాయకుండా వుండేందుకు డబ్బులు దండుకుంటున్నారు. ఇలా అంగన్వాడీ కార్యకర్తలను అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, వారిని ఆపై వుండే సీడీపీవోలు దోపిడీ చేస్తున్నట్లు విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మొత్తం జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై అధికారులు ఆరా తీస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

మేం వెళ్లిపోతాం..

- సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎంపీడీఓల ఎదురుచూపులు
- ఇక్కడి విధులకు మొక్కుబడిగా హాజరు

గుంటూరు సిటీ, ఆగస్టు 5: 'ఏమండీ ఇవన్నీ మాకెందుకండీ.. రేపో.. మాపో వెళ్లిపోతాం.. దయచేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి' అంటూ జిల్లాలోని కొందరు ఎంపీడీఓలు (మండల అభివృద్ధి అధికారులు) బేలగా మాట్లాడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇక్కడకు వచ్చిన ఎంపీడీఓలు విధి నిర్వహణలో చాలా అనాసక్తత ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో వివిధ జిల్లాల నుండి ఉమ్మడి జిల్లాకు వచ్చిన ఎంపీడీఓలు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాకు 35మంది ఎంపీడీఓలు ఇతర జిల్లాల నుండి వచ్చారు. కడప నుండి ఒకరు, కృష్ణా జిల్లా నుండి 12 మంది, ప్రకాశం జిల్లా నుండి 22 మంది ఎంపీడీఓలు ఎన్నికల విధుల నిమిత్తం వచ్చారు. ఉమ్మడి జిల్లా నుండి కూడా అంతే మంది ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. వాస్తవానికి ఎన్నికలు ముగిసిన తర్వాత వారికి సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వాలి. ఇతర జిల్లాల నుండి వచ్చిన తహసీల్దార్‌లను అదే రీతిలో సొంత జిల్లాలకు పంపి పోస్టింగ్‌లు ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఎంపీడీఓలను మాత్రం ఇక్కడే ఉంచటంతో కీలకమైన మండల అభివృద్ధి విషయాల్లో ప్రభావవంతమైన నిర్ణయాలు జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సమయంలో పక్క జిల్లాల నుండి వచ్చిన ఎంపీడీఓలు మండలాలకు సంబంధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను సరిగా పట్టించుకోవటం లేదని తెలుస్తోంది. కార్యాలయానికి రావటం.. పోవడం తప్ప పెద్దగా విధులు నిర్వహించటం లేదని అంటున్నారు. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయాల్లో ఈఓపీఆర్డీలు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

మారిస్తేనే మంచిది....

ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. జిల్లా పరిషత్‌లో ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటుచేసి పారిశుధ్యంపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నా కొందరు పంచాయతీ సెక్రటరీలకు చీమ కుట్టినట్లు కూడా ఉండటం లేదు. గ్రామస్థాయి నేతలు సదరు విషయాలను ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్తున్నారు. నేతలు చెబుతున్న విషయాలను ఎంపీడీఓలు పెద్దగా సీరియస్‌గా తీసుకోవటం లేదు. వెళ్లిపోతాం అన్న ఆలోచనతో పనులపై పెద్దగా ఆసక్తి చూపటం లేదు. మండల స్థాయి నేతలు కూడా త్వరగా ఇతర జిల్లాల ఎంపీడీఓలను వెనక్కు పంపిస్తేనే బాగుంటుందని అంటున్నారు. ఈ జిల్లా వాళ్ళకు ఇక్కడ విధులు కేటాయిస్తే మండల అభివృద్ధిపై బాధ్యతగా విధులు నిర్వహిస్తారని అంటున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకుంటుందని అందరూ భావిస్తున్నారు.

11 క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ

- పులిచింతలకు 1,32,000 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, ఆగస్టు 5: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 1,32,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు సోమవారం ఎస్ఈ వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. తొలుత పూజలు నిర్వహించి 11 క్రస్ట్‌గేట్లను ఎత్తినట్లు పేర్కొన్నారు. ఎగువన వున్న నాగార్జునసాగర్ నుంచి 1,32,000 క్యూసెక్కులు నీరొస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకున్న 20 క్రస్ట్ గేట్లకు గాను 11 గేట్లను ఎత్తామని అందులో 6 గేట్లు 2.5 మీటర్లు, 5 గేట్లు 2 మీటర్లమేర ఎత్తి 1,24,000, రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.01 మీటర్ల నీరుండగా ఆ నీరు 6.87 టీఎంసీలకు సమానమన్నారు.పూర్తిస్థాయి నీటిమట్టం 7.080 టీఎంసీలు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. నదిలో చేపల వేటకు వెళ్ళొద్దని మైక్ ద్వారా హెచ్చరిక జారీ చేశామన్నారు.

పెండింగ్ ఎల్పీఎస్ పూర్తిచేయాలి

- సీఆర్డీఏ అధికారులకు అడిషనల్ కమిషనర్ ఆదేశం



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన అడిషనల్ కమిషనర్ సూర్య సాయిప్రవీణ్

తుళ్లూరు, ఆగస్టు 5: సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లతో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సూర్య సాయిప్రవీణ్ తుళ్లూరు కార్యాలయంలో సోమవారం సమావేశం అయ్యారు. ఎల్పీఎస్(ల్యాండు పూలింగ్ స్కీ) కింద ఎంత భూమి రావాల్సివుందో గుర్తించి వారితో మాట్లాడి పూర్తిచేయాలని సూచించారు. కానీ గ్రామాలలో ఒక ఎకరం, రెండు ఎకరాలు చిన్న చిన్న సమస్యల కారణంగా ల్యాండు పూలింగ్ కింద రాలేదు. ఇప్పుడు దానిని పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటికే రైతుల రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు వేగవంతం అయ్యాయని, ఇంకా స్పీడ్ పెంచాలని ఆదేశించారు. జంగిల్ క్లియరెన్స్ పూర్తయ్యేనాటికి ల్యాండు పూలింగ్, రిజిస్ట్రేషన్‌లు పూర్తైతే రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకాలుండవని, అధికారులు ఆ దిశగా పనిచేయాలని సమావేశంలో చర్చించారు. అనంతరం రైతులు తమ సమస్యలపై అర్జీలను అడిషనల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెప్షల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు, వివిధ యూనిట్‌ల డీసీలు, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీడియోలు, ఫొటోలు తీయవద్దు...

తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం జరుగుతుండగా విలేకరులు ఫొటోలు, వీడియోలు తీయబోతుంటే అదనపు కమిషనర్ సాయి సూర్య అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశం గురించి మాట్లాడమని కోరినా.. అందుకు తిరస్కరించటం విశేషం. మీడియాతో ఏమీ మాట్లాడవద్దని కమిషనర్ కాటంనేని భాస్కర్ నుండి ఆదేశాలుండటంతో ఆయన ఈవిధంగా స్పందించినట్టు తెలిసింది. రాజధాని గ్రామాలలో, సీఆర్డీఏలో జరుగుతున్న కార్యక్రమాల గురించి మీడియాకు చెప్పకపోవటంతో సమాచారం ప్రజలకు తెలియటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

రైలు కింద పడి యువకుడు మృతి



పెదకోట్ల బాలస్వామి(ఫైల్)

ఫిరంగిపురం, ఆగస్టు 5: ఫిరంగిపురంలోని రసూల్ పేటకు చెందిన పెదకోట్ల బాలస్వామి (33) ఈనెల 3వ తేదీ రాత్రి సుమారు 10:30 గంటలకు రైలు కిందపడి మృతిచెందగా సోమవారం మృతునికి ఫిరంగిపురంలో అంత్యక్రియలు చేశారు. మృతుని బంధువుల కథనం మేరకు మృతుడు పెద కోట్ల బాలస్వామి 3వ తేదీ రాత్రి 10:30 గంటలకు మానసికంగా బాగా లేక ఆరోగ్యనగర్‌కు వెళ్ళే రైల్వే అండర్ బ్రిడ్జికి దగ్గరలో శనివారం రాత్రి రైల్వేపట్టాలపై పడిపోగా గుంటూరు నుంచి వెళ్ళే అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు బాలస్వామి పైనుంచి వెళ్ళగా తల, మొండెం వేరయ్యాయి. నరసరావుపేట రైల్వే పోలీసులు మృతదేహాన్ని తీసుకువెళ్ళి పోస్టుమార్టం చేసి మృతుడి స్వగ్రామమైన ఫిరంగిపురం తీసుకువచ్చి అప్పగించారు. మృతునికి భార్య గోవర్ధని, కుమారులు మేరీ జోసెఫ్ తేజ, ప్రేమ్ కుమార్‌లు ఉన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని మహిళ...

తాడికొండ, ఆగస్టు 5: గుర్తు తెలియని కారు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన తాడికొండ మండలం లాంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాడికొండ మండలం పాములపాడు గ్రామానికి చెందిన కార్యంశెట్టి స్రామ్రాజ్యం(55) కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతోంది. గుంటూరు హస్పటల్‌లో వైద్యం చేయించుకోవటానికి కుమారుడు సాంబశివరావు, కోడలు స్వాతితో కలిసి ద్విచక్రవాహనంపై గుంటూరు బయలుదేరారు. లాం చలపతి కళాశాల దాటిన తరువాత వెనుక నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని కారు ఢీ కొట్టడంతో స్రామ్రాజ్యం తలకు బలమైన గాయమైంది. కుమారుడు, కోడలికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆటోలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి స్రామ్రాజ్యంను చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ స్రామ్రాజ్యం మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాంబశివరావు ఫిర్యాదు మేరకు తాడికొండ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

ముప్పాళ్ళ, ఆగస్టు 5: తండ్రి హాస్టల్‌లో ఉండి చదువుకోమని మందలించటంతో విద్యార్థి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదలలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యు ల కథనం మేరకు మాదల గ్రామానికి చెందిన సుంకర చంద్రశేఖ ర్(22) నరసరావుపేటలోని ఒక కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవ త్సరం చదువుతున్నాడు. కళాశాలకు వెళ్ళకుండా తిరుగుతుండటం తో తండ్రి శ్రీను మందలించాడు. దీంతో చంద్రశేఖర్ ఆదివారం పురుగుమందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం చంద్రశేఖర్ మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు ఇలా మృతి చెందటంతో తల్లి బోరున విలపించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హజరత్తయ్య తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని...

మాచర్లటౌన్, ఆగస్టు 5: ఉరివేసుకొని ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన జక్కి రేణుక యల్లమ్మ (22) మాచర్ల మండల పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మాచర్ల పట్టణంలోని కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో హాస్టల్‌లోని స్టడీరూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం గమనించిన తోటి విద్యార్థినులు పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రేణుక యల్లమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తండ్రి గౌరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మయ్య తెలిపారు. విద్యార్థిని రేణుక యల్లమ్మ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఉచిత బియ్యాన్ని డీలర్లతో పంపిణీ చేయించాలి

- కేంద్ర మంత్రి పెమ్మసానికి రేషన్ డీలర్ల విజ్ఞప్తి



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని కలిసి సమస్యలను వివరించిన రేషన్ డీలర్లు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తోన్న రేషన్ బియ్యాన్ని డీలర్ల ద్వారా పంపిణీ చేయించాలని ఆంధ్రప్రదేశ్ చౌకధరల దుకాణాదారుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి విజ్ఞప్తి చేశారు. సోమవారం గుంటూరులో అసోసియేషన్ నాయకులు కేంద్ర మంత్రిని కలిసి సమస్యలను నివేదించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ పౌరసరఫరాల చట్టం ప్రకారం రేషన్ డీలర్ల వ్యవస్థ ఏర్పాటైందని, దీని దృష్ట్యా ఎండీయూ, సివిల్ సప్లయిస్ కంట్రోలింగ్ ఆర్డర్‌లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైఏబీ ప్రసాదరావు, చీఫ్ అడ్వయిజర్ దాసరి శ్రీనివాసరావు, నగర నాయకులు వీ అంజయ్య, నిర్మల, రవి చంద్రమోహన్, రషీద్ పాల్గొన్నారు.

నూతన భవన సముదాయానికి రూ.12 లక్షల విరాళం



దాతలను సత్కరిస్తున్న కమ్మ జన సేవా సమితి పాలకవర్గ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5: జేకేసీ రోడ్డులోని కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో రెండు గదుల నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని రూ.12లక్షల చెక్కును విశ్రాంత హిందీ ఉపాధ్యాయురాలు వేములపల్లి రాణీ ప్రమీల, విశ్రాంత విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీరు ఎం.మల్లికార్జునరావు దంపతులు సోమవారం స్థానిక పట్టాభిపురంలోని వారి నివాసంలో పాలకవర్గ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శకత, విద్యార్థినులకు రక్షణ, పరిశుభ్రమైన భోజనం అందిస్తున్న కమ్మజన సేవా సమితి సేవలు అభినందనీయమని అన్నారు. సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేద కుటుంబంలో పుట్టిన వారు ఇంత పెద్ద విరాళం అందజేయడం అభినందనీయమని అన్నారు. దాతల సహకారంతో నూతన భవన నిర్మాణం మొదలైందని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. అనంతరం దాతలను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వడ్లమూడి నాగేంద్రం, గుంటుపల్లి కోటేశ్వరరావు, మద్దిపూడి సీతారామయ్య, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



గోపీకృష్ణ, వేణు (ఫైల్ ఫొటోలు)

మంగళగిరి సిటీ, ఆగస్టు 5: మంగళగిరి పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మంగళగిరి పట్టణ ఎస్ఐ బి.రవీంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చీరాల మండలం తోటవారిపాలెం గ్రామానికి చెందిన గోలి వేణు (23), లింగంపల్లి గోపీకృష్ణ (25) వరుసకు బావ, బావమరుదులు అవుతారు. గోపీకృష్ణ స్వర్ణకార వృత్తి నేర్చుకునే నిమిత్తం సుమారు ఇరవై రోజుల నుంచి మంగళగిరిలోని బంధువుల వద్ద వుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో గోపీకృష్ణను కలిసేందుకు వేణు తోటవారిపాలెం నుంచి వచ్చాడు. ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం చినకాకాని నుంచి మంగళగిరి పట్టణంలోకి వస్తున్నారు. ఎర్రచెరువు కాళీమాత ఆలయం ఎదురుగా వున్న మలుపు వద్దకు రాగానే రోడ్డుపై ఆవులు అడ్డుపడ్డాయి. వాటిని తప్పించబోయి బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో వేణు, గోపీకృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేణు తండ్రి గోలి రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

27,626 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 30,579 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 27,626 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 19,051 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000	334	9500	13500
నెంబరు. 5	9000	13000	నెంబరు.5	--	--
273	9500	12500	273	--	--
341	8500	15000	341	11000	3500
4884	--	--	4884	12500	12500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	8000	18300
బ్యాడిగి	8500	15500	బ్యాడిగి	9000	14000
దేవనూరుడీలక్స్	9000	13000	దేవనూరుడీలక్స్	--	--
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	6000	10000

రూ.4 కోట్లతో గ్రామాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 5: రూ.4 కోట్ల నిధులతో గ్రామాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం భట్టిప్రోలులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ భట్టిప్రోలు విఠలేశ్వర్‌నగర్, అద్దేపల్లి దళితవాడ, భట్టిప్రోలులో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు, జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా కింద రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి పైపులైన్ల పునరుద్ధరణకు రూ.1.50 కోట్లు, అద్దేపల్లిలో పవర్‌హెడ్ నిర్మాణానికి రూ.30 లక్షలు, రక్షిత మంచినీటి పనుల పునరుద్ధరణకు రూ.75 లక్షలు, నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారని, సంబంధిత అధికారులతో చర్చించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. ప్రతిపాదనల తయారీలో గ్రామీణ నీటి సరఫరా సహాయక ఇంజనీర్ శివరామకృష్ణ, పంచాయతీ ఏఈ రామచంద్రరావు, కార్యదర్శి వాకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఆర్డీవో హేలా షారోన్

రేపల్లె, ఆగస్టు 5: కృష్ణానదికి వరదనీరు పోటెత్తే పరిస్థితి నెలకొందని తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రేపల్లె, భట్టిప్రోలు మండలస్థాయి అధికారులతో వరదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణాకరకట్ట వెంబడిలో ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కరకట్టలు బలహీనపడిన ప్రాంతాలను గుర్తించాలని అవసరమైతే ఆర్‌సీ అధికారులతో కరట్టలను బలపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీశైలం,నాగార్జునసాగర్ నుంచి దిగువకు కిందకు వదలటంతో వరదనీరు వచ్చే పరిస్థి తి నెలకొందన్నారు. రెవెన్యూ, ప్రజాపరిషత్ అధికారులు, వీఆర్‌వోలు ఎప్పటికప్పుడు వరద ఉధృతిపై పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్, పోలీస్ సిబ్బంది, వీఆర్‌వోలు, సెక్రటరీలు, ఈవోపీఆర్డీవోలు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో రేపల్లె, భట్టిప్రోలు మండలస్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారోన్

చిరుఉద్యోగులపై వేధింపులు ఆపకపోతే ఉద్యమిస్తాం

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

బాపట్ల, ఆగస్టు 5: చిరుఉద్యోగులు, స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపకపోతే ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ముఖద్వారం వద్ద చిరు ఉద్యోగులతో బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ఉద్యోగులకిచ్చే 10వేలు వేతనం కూడా నెలల తరబడి బకాయిలు పెడితే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగు డిపార్ట్‌మెంట్‌లో రాజకీయ నాయకులు నుంచి కింది స్థాయి అధికారుల వరకు ముడుపులు అందుతున్నాయని.. ఎక్కడైన అవినీతి బయటకొస్తే మా త్రం యానిమేటర్‌లను బాధ్యురాలని చేసి మిగిలినవారు తప్పించుకుంటున్నారని రాజకీయ వేధింపులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ కింద కార్మిక వర్గాలందరిని ఐక్యం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్. మణిలాల్, మజుందార్, ఐకేపీ వీవోఏ జిల్లా అధ్యక్షురాలు కె.లక్ష్మీ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.ధనలక్ష్మీ, వెంకటేశ్వరమ్మ, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అరవింద వారధి దిగువన గండి పూడ్చివేత పనులు



అరవింద వారది దిగువన గండిని పూడ్చే పనిలో యంత్రాలు

కొల్లూరు, ఆగస్టు 5 : వరద బారి నుంచి పంట పొలాలు కాపాడుకునేందుకు గండి పూడ్చివేత పనులను రైతులు చేపట్టారు. సోమవారం మండల పరిధిలోని పెసర్లంక అరవింద వారధి ఎగువన రెండు ఎస్కవేటర్లతో సర్పంచ్ వెలివెల బసవరత్తయ్య గండి పూడ్చివేత పనులను చేపట్టారు. 20 మీటర్లు వెడల్పున 100 మీటర్లు పొడవున గండి పూడ్చివేతకు శ్రీకారం చుట్టారు. ఇందుకయ్యే ఖర్చును ఆర్‌సీ అధికారులు ముందుకు రాకపోతే గ్రామ పరిధిలో ఉన్న రైతులే భరించి వరద బారి నుంచి తమ పంటలను కాపాడుకునేందుకు గండి పూడ్చివేత పనులను చేయిస్తున్నట్లు తెలిపారు. గండి పూడ్చివేతకు సుమారు వారం రోజులు సమయం పడుతుందని ఈలోగా వరద నీరు రాకుండా ఉంటే చేసిన శ్రమ వృథా కాకుండా ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు.

బగళాముఖి ఆలయంలో సహస్ర కలశాభిషేకాలు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 5 : మండలపరిధిలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారికి సోమవారం శ్రావణ మాసం పురస్కరించుకొని 1008 సహస్ర కలశాలతో, పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో, విశేష వేదమంత్రాలతో అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహామూర్తి తెలిపారు. తొలుత వేదస్వస్తితో, మంగళవాయిద్యాలతో వేద విద్యార్థులు, భక్తులు, అర్చకులతో కలిసి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. బగళాముఖి అమ్మవారికి హోమ పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పల్నాడు జిల్లా చావపాడు గ్రామానికి చెందిన శ్రీగీత వెంకటేశ్వర వేద పాఠశాలలో నుంచి 75 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనటం ఆలయ ప్రాంగణంలో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బగళాముఖి అమ్మవారు



కలశాభిషేకంలో పాల్గొన్న శ్రీగీత వెంకటేశ్వర వేద పాఠశాల విద్యార్థులు

ఎంపీడీవోగా ఊహారాణి బాధ్యతల స్వీకరణ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 5: ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఊహారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భట్టిప్రోలు ఎంపీడీవోగా మల్లికార్జునరావు జూలై 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఊహారాణికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

అర్జీదారులకు అల్పాహారం

బాపట్ల, ఆగస్టు 5 : కలెక్టర్ ప్రాంగణంలో కలెక్టర్‌కు అర్జీలిచ్చేందుకు వచ్చిన ప్రజలకు, అర్జీదారులకు అల్పాహారం, మంచినీరు అందించే సేవకు సీనియర్ రెడ్‌క్రాస్ సభ్యులు కర్పూరపు మురళీ సహకరించారు. వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన 350 మందికి పైగా ప్రజలు అల్పాహారాన్ని తీసుకొని రెడ్‌క్రాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమం ప్రతి సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించటం జరుగుతుందని చైర్మన్ నారాయణభట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో బి.రామసుబ్బారావు, డి.రమణబాబు, గోపిలు పాల్గొన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



భర్తీపూడి గ్రామ సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్లరూరల్, ఆగస్టు 5: రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితమవ్వాలని నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు బాధ్యతాయుతంగా పనిచేయాలని వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. సోమవారం బాపట్ల మండలం భర్తీపూడి గ్రామ కమిటీ భవనంలో అధికారులతో కలిసి గ్రామ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని స్థాయిల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రజల అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ సమావేశంలో మండలస్థాయి అధికారులు పలు అంశాలపై మాట్లాడారు. వివిధశాఖల అధికారులతో మండలంలో జరగాల్సిన అభివృద్ధి పనులపై నరేంద్రవర్మ సమీక్ష నిర్వహించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని లేకుంటే తమ గమ్యస్థానాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.కృష్ణకాంత్, ఎంపీడీవో పి.విజయశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సురేష్, గ్రామసర్పంచ్ అచంట అమరేష్, టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, ఇనగంటి గాంధీ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలకు పరిశుద్ధ తాగునీరందించాలి

బాపట్ల, ఆగస్టు 5: బాపట్ల ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరందించాలని అందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. సోమవారం బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌తో కలిసి పట్టణంలోని మూర్తిరక్షణ్‌నగర్‌లో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించి అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలను చేశారు. అదేవిధంగా సూర్యలంకరోడ్డులోని ఈనెల 15న పునఃప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ పనులను అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించా రు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, టీడీపీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శానిటేషన్ మెరుగునకు అధికారులు కృషి చేయాలి

బాపట్ల పట్టణంలోని అన్ని వార్డుల్లో శానిటేషన్ మెరుగుపర్చే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని పరిసరాల శుభ్రతకై కృషి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం 26వవార్డును సందర్శించారు. స్థానిక ప్రజలు పడుతున్న సమస్యలు తెలుసుకుంటూ మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా వ్యాపారులకు నరేంద్రవర్మ భరోసా

కర్లపాలెం, ఆగస్టు 5: నియోజకవర్గంలో ఆక్వాసాగు చేస్తున్న రైతులకు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని వేగేశన నరేంద్ర వర్మ భరోసానిచ్చారు. కర్లపాలెంలోని ఆక్వా వ్యాపారులందరు సోమవారం నరేంద్రవర్మను కలిసి ఏపీఎస్ఏడీఏ యాక్ట్ 2020 సంబంధించి డిపార్ట్‌మెంట్‌వారు షాపులపై చేస్తున్న దాడుల గురించి వివరించారు. ఆక్వా వ్యాపారులు చెప్పిన అంశాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆయన భరోసానిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, అనిత ఎంటర్ ప్రైజస్ రాము, సాయి ఎంటర్ ప్రైజస్ పెనుమెత్స వెంకటనరసరాజు (పెదబుజ్జి), రుద్రట్రైడర్స్ కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యారంగంలో గత ప్రభుత్వ విధానాలే కొనసాగిస్తారా?!

● ఏపీటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోషలిజం



సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు

కొల్లూరు, ఆగస్టు 5 : గత ప్రభుత్వం అనుసరించిన విద్యా విధానం వల్ల విద్యారంగంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని పరిష్కరించి విద్యారంగాన్ని గాడిలో పెడతామని ప్రకటించి మళ్లీ అవే తప్పిదాలను కొనసాగించేలా చూస్తున్నట్లు తెలుస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోషలిజం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కొల్లూరు మండల పరిషత్ పాఠశాలలో ఏపీటీఎఫ్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం చేసిన జీవో 117 రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ప్రయత్నం చేయకోగా తాజాగా పని సర్దుబాటు జీవో చేయాలని అధికారుల సమావేశంలో చర్చించినట్లు తెలుస్తుందన్నారు. ఆ సర్దుబాటు జిల్లా, మండల స్థాయిల్లో నిర్వహించకుండా రాష్ట్ర స్థాయిలో కమిషనరేట్ నుంచి జరపాలని నిర్ణయించిందని, దీనిని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖలో నెల నెలా పదోన్నతులు ఇచ్చే విధంగా ఆదేశాలు ఉన్నాయని, కానీ సంవత్సర కాలంగా అవి అమలు కావడం లేదన్నారు. వెంటనే పదోన్నతులు చేపట్టి అర్హత ఉన్న వారికి ఉన్నత స్థాయిలో నియామకాలు చేస్తే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందన్నారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరగాలంటే వెంటనే పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నప్పటికి ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమన్వయ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేస్తే క్షేత్రస్థాయి లో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఉపాధ్యాయ సంఘాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షుడు వై నేతాంజనేయప్రసాద్, ఏపీ టీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ టి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, సభ్యులు శివనాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మాలకొండయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 5: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. సోమవారం బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయంలోని తల్లిపాల వారోత్సవాల సభలో ఆయన పాల్గొని పలువురు చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని చేపట్టి ఆశీర్వదించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందజేయాలని కోరారు. ఏమైన సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని పరిష్కారమార్గం చూపుతానని అంగన్‌వాడీ కార్యకర్తలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, ఎంపీడీవో విజయశేఖర్, తహసీల్దార్ కృష్ణకాంత్, ఐసీడీఎస్ లక్ష్మీపార్వతి, టీడీపీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషక ఆహారం తీసుకోవాలి : డాక్టర్ సురేష్‌బాబు

వేమూరు, ఆగస్టు 5: బాలింతలు, గర్భిణులు పోషక ఆహారాన్ని తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ వెంకట సురేష్‌బాబు సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం చదలవాడ గ్రామంలో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరియా సూపర్‌వైజర్ కె.మాధవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సాధిక్, ఏఎన్ఎం బాగ్యలక్ష్మి, మహిళా పోలీసు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో ముగిసిన యునిక్స్ శిక్షణ

బాపట్ల, ఆగస్టు 5: స్థానిక బాపట్ల ఫార్మసీ కళాశాలలో గడిచిన నెలరోజులు బెంగళూరుకు చెందిన ఉన్నత సంస్థ ఆధ్వర్యంలో యునిక్స్ శిక్షణా కార్యక్రమం సోమవారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ గోపాలకృష్ణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగ్లభాషపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, విద్యార్థుల జీవితానికి కీలకమన్నారు. కార్యక్రమంలో చేంజ్‌మేకర్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో పోలీసు పికెట్ ఏర్పాటు

కర్లపాలెం, ఆగస్టు 5: కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పాతూరు కొత్తూరు గ్రామానికి చెందిన యువకులు పాత గొడవలు నేపథ్యంలో ఆదివారం రాత్రి దుండుబాటలోని మసీదు వద్ద కొట్టుకునే ప్రయత్నం చేశారని ఇన్‌చార్జి ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు. గొడవలు పెద్దవికాకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై వారిని చెదరగొట్టి అక్కడ నుంచి పంపించి వేశామన్నారు. గొడవలు మరలా జరగకుండా పోలీసు సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేశామని ఎస్ వివరించారు.

ప్రమాదశాత్తు గృహం దగ్ధం

రేపల్లె, ఆగస్టు 5: పట్టణంలోని 16వవార్డుకు చెందిన కొట్టు సురేష్ అతను ప్రమాదశాత్తు ఇంటికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సోమవారం ఇసుకపల్లి 16వవార్డులో కొట్టు సురేష్ గృహానికి ప్రమాదశాత్తు నిప్పంటుకుని కాలిపోవటంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. సుమారు రూ.1.50వేలు ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు

నగరం, ఆగస్టు 5: నాటుసారా, బెల్టుషాపులను నిర్వహించేవారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని సెబ్ సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం ఎంపనివారిపాలెంలో దాడులు నిర్వహించగా సుమారు వెయ్యిలీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. సారా తయారు చేస్తే వారిని సహించే ప్రసక్తే లేదని ఆయన తెలియజేశారు. ఈ దాడుల్లో సిబ్బంది చిలకా రాజు, హోంగార్డు గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చావలిలో యువకుడి ఆత్మహత్య

వేమూరు, ఆగస్టు 5: మండలంలోని చావలికి చెందిన ఓ యువకుడు సోమవారం రాత్రి 7గంటల సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. స్థానికుల సమాచారం ప్రకారం బండారు వెంకట మురళీకృష్ణ (23) కులాంతర వివాహం చేసుకున్నాడు. వారికి మూడు నెలల చిన్న పాప ఉంది. కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడని కొందరు చెబుతుండగా అప్పుల బాధతో చనిపోయినట్లు మరి కొందరు స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మృతుడి కుటుంబానికి మంత్రి ఆర్థిక సాయం

రేపల్లె, ఆగస్టు 5: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎప్పుడు ముందుంటారని నిజాంపట్నం టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ అన్నారు. సోమవారం నిజాంపట్నం మండలం గోకర్ణమఠం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనగాని అందించిన ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయుడు నరసింహమూర్తి, ఖాదర్‌బాబు, ఇమ్రాన్, నీలం కోటి, పవన్, నాని, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన జనసేన నాయకులు

కర్లపాలెం, ఆగస్టు 5 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలను మండల జనసేన ఉపాధ్యక్షుడు చిలక సురేంద్రబాబు, ఎంఈవో-2 విజయశ్రీలతో కలిసి డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని, తరగతి గదులను సోమవారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద మంజూరైన నిధులు, పాఠశాలలో కల్పించిన మౌలిక వసతులు కల్పించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వర్ణవేణు మాధవ్, ఇనకొల్లు పోలీసురావు, గుండిమెడ పసుపతిరావు, కొండపాటూరు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్

అమృతలూరు, ఆగస్టు 5: దాతల సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థుల కోసం మినరల్ వాటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. సోమవారం పాఠశాల ఆవరణలో మినరల్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఇటీవల తురుమెళ్ల గ్రామానికి చెందిన యలమంచిలి మనోరమ రూ.50 వేలను పాఠశాలకు అందించారు. దీంతో పాఠశాలలో మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు మినరల్ వాటర్‌ను అందించారు. కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, పర్వతనేని భానుప్రసాద్, హెచ్ఎం నిరీక్షణరావు, కె.మాధవరావు, కాళిదాసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికను ఉపయోగించుకోవాలి

● తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం

కర్లపాలెం, ఆగస్టు 5: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తు న్న ప్రజాసమస్యల పరిష్కారవేదికను ఉపయోగించుకోవాలని తహసీల్దార్ ఎస్ వెంకటరత్నం ప్రజలను కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజలు తమకు నేరుగా నివేదించాలని తమ పొలాలకు సంబంధించిన సమస్యలు ఏమైన ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజి, సీహెచ్‌వో మీరమ్మ, వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, ఈవో పీఆర్డీ ఏలీషా తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులపై రైతులకు అవగాహన

పిట్టలవానిపాలెం, ఆగస్టు 5 : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాటించాల్సిన సాగుకు పద్ధతులు, భూసార పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువుల వాడకం గురించి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అత్తార్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం పిట్టలవానిపాలెం రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్. సత్యానంద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం ఉషా మాట్లాడుతూ వరి మేలైన వంగడాలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక సమన్వయకర్త డాక్టర్ ఆర్ బాలమురళీధర్ నాయక్, శాస్త్రవేత్త ఎంఉషా, బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మీ, వ్యవసాయ సిబ్బంది ఏఈవోలు, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు కార్డులపై అవగాహన కల్పించాలి

నగరం, ఆగస్టు 5: పంట నమోదు, కౌలురైతు కార్డులపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అగ్రికల్చరల్ అసిస్టెంట్, వీఆర్‌వోలకు నగరం తహసీల్దార్ ఎం.సత్యనారాయణ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ అగ్రికల్చరల్ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు పంట నమోదులో పాటించాల్సిన జాగ్రత్తల గురించి కూలంకుశంగా అన్నదాతలకు వివరించాలని సూచించారు. తద్వారా ధాన్యాన్ని అమ్ముకోవటంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉంటారని ఆయన అన్నారు.

ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

● జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు



కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సీహెచ్ సత్తిబాబు

బాపట్ల, ఆగస్టు 5 : ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను విన్నవించారు. 156 అర్జీలు నమోదయ్యాయని ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దన్నారు. కార్యక్రమంలో ద్వితీయశ్రేణి అధికారులు పాల్గొన్నారు.

పొలాల్లోకి మురుగునీరు వదులుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, ఆగస్టు 5: బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామసమీపంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన డ్రైనేజి వాటర్ పంటకాల్వలోకి పైపులైన్ ద్వారా వదులుతున్నారంటూ వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం కలెక్టర్‌కు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని అధికారులకు బీఎస్పీ తరఫున జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు అందజేశారు.

కుల జనగణన వెంటనే జరిపించాలంటూ వినతిపత్రం

బాపట్ల రూరల్, ఆగస్టు 5: కుల జగగణన వెంటనే జరిపించాల్సిందిగా డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమ్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూఅధికారి సత్తిబాబుకు బాపట్ల జిల్లా ఇండియా కూటమి నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేడా శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం సీపీఐ నాయకులు శ్రీధర్, కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షులు దోనేపూడి దేవరాజు, కాంగ్రెస్‌నాయకులు సాగర్, వడ్లమూడి భాస్కరరావు, పిన్నిబోయన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు వాగులోకి పోయేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి

బాపట్లరూరల్, ఆగస్టు 5: వరదనీరు పంటపొలాల్లో ఎక్కువరోజులు ఉంటున్నాయని వాగుకు మరమ్మతులు జరిపించి వరదనీరు వాగులోకి పోయేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలంటూ ఇంకొల్లు మండలం కొనికి గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.

సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేయాలి

● ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న ఏఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల, ఆగస్టు 5 : ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకొని బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఇతర సమస్యలపై 55 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను ఏఎస్పీకి విన్నవించుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సింగయ్య, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి
మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బాపట్ల, ఆగస్టు 5 : పట్టణ ప్రజల సమస్యలు పరిష్కార చర్యలు దిశగా బాపట్ల పురపాలక సంఘం కార్యాలయం నందు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని బాపట్ల పురపాలక సంఘ కమిషనర్ నిర్మల్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం నందు కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 98499 07943 ఏర్పాటు చేసి వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో పాటు ఇతర సచివాలయ సిబ్బందిని మూడు షిఫ్ట్‌లుగా డ్యూటీలు కేటాయించటమైనదని తద్వారా సత్వర పరిష్కార చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

● డీఎస్పీకి వినతిపత్రం అందజేత

బాపట్ల, ఆగస్టు 5: బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణకు సోమవారం గౌడసంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా గౌడ జేఈసీ సంఘనాయకులు పరిశా వెంకట్ మాట్లాడుతూ కర్లపా లెం మండలం నల్లమోతువారిపాలెంలో దివ్యాంగుడైనటువంటి సూరగాని శ్రీనివాసరావు భార్యని పొలంలో ఎ.గోపిరెడ్డి అనే వ్యక్తి విపరీతంగా కొట్టటం వల్ల ఆమె అవ మానంతో పురుగుల మందు తాగి చనిపోయిందని తెలిపారు. దీనిపై బాపట్ల డీఎస్పీకి వినతిపత్రాన్ని అందజేయగా ఆ కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని గోపిరెడ్డిని అరెస్టు చేస్తామని డీఎస్పీ హామీనిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ జేఈసీ సంఘనాయకులు దొంతా సురేష్, మోర్ల వెంకటకృష్ణ, కుక్కలరామప్రసాద్, యెనుమల ప్రదీప్, మాజీ గవర్నమెంట్ హాస్పిటల్ చైర్మన్ కర్పూరపు రామారావు, ఉప్పాల మురళీ, నల్లమోతువారిపాలెం ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 అర్జీలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 5 : గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అద్దేపల్లిలో 5జీ సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని ఒకటి, మండల గ్రామం వెల్లటూరులో మాగాణి భూములకు సాగునీరు అందించే కాల్వ పూడిక తీయించాలని రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. రైతు సంఘం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సర్పంచ్ కృష్ణమోహన్, కౌలు రైతు సంఘం నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేమూరు, ఆగస్టు 5: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు.

ప్రజాసమస్యల వేదికకు నాలుగు ఫిర్యాదులు

రేపల్లె, ఆగస్టు 5: ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం మండలం సజ్జావారిపాలెం శివారు ఉల్లిపాలెంలో వైన్‌షాపు ఉండటం వల్ల మందు సీసాలను పంటకాల్వల్లో, రహదారి బాటలోను, పొలాల్లో వేస్తున్నారు పక్కనే పాఠశాల ఉండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని రైతులు గాజుపెంకులు గుచ్చుకుని ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. తక్షణమే ఈసమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ దాఖలు చేశారన్నారు. రేపల్లె పట్టణం 13వార్డుకు చెందిన వేమూరి తిరుపతిరావు నీటి కనెక్షన్ లేకపోయిన వాటర్ ట్యాక్స్ వచ్చిందని విచారించి వాటర్‌ట్యాక్స్‌ను రద్దుచెయ్యాలని కోరారు. రేపల్లె మండలం పిరాట్లంక గ్రామానికి చెందిన నీలా అప్పారావు మురుగునీరు సమస్యను పరిష్కరించాలని కోరారు. నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామం నుండి మట్లపూడి నాగేశ్వరరావు,భీమయ్య కాల్వ పోరంబాకుకు 1985వ సంవత్సరం నుంచి కొబ్బరి చెట్లు పెంచుకోమని స్థలం ఇచ్చారని ఆస్థలంలోని చెట్లను తొలగించాలంటూ కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.

నేడు చుండూరు మృతవీరుల సంస్మరణ సభ

చుండూరు, ఆగస్టు 5: చుండూరు దళిత బాధిత పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11గంటలకు రక్తక్షేత్రం వద్ద చుండూరు మృతవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు పోరాట కమిటీ అధ్యక్షుడు జాలాది మోజేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభ కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల్లోని దళిత, ప్రజాసంఘాల నాయకులు, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొంటారని తెలిపారు.

వాట్సప్ గ్రూపులు తొలగించాలి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5: గ్రామ, వార్డు వలంటీర్లు ఏర్పరిచిన వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆ గ్రూపుల నుంచి వైదొలిగేలా ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే ఆ గ్రూపులు పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల వాటిని తొలగించి నివేదికను పంపాలని కలెక్టర్లను ఆదేశించింది.

జలజీవన్ మిషన్ పనితీరుపై పల్స్ సర్వే

ఈనెల 8నుంచి 14 వరకు సర్వే

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5: గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పథకం అమలు తీరుపై పల్స్ సర్వేకు ప్రభుత్వం ఆదేశించింది. ఈనెల 8నుంచి 14 వరకు సర్వే నిర్వహించి ఫలితాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఈ సర్వే నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 95,44,599 కుటుంబాలు ఉన్నాయి. జలజీవన్ మిషన్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం 70,13,580 గృహాలకు తాగునీటి కుళాయిలు ఉన్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఈనెల 9 నుంచి 14 వరకు ఇంటింటికి వెళ్లి అసలు కుళాయిలు ఉన్నాయా లేవా, నీరు వస్తుందా, లేదా అన్న వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సర్వే నిర్వహణపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈనెల 8న శిక్షణ ఇస్తారు. గ్రామపంచాయతీల్లో పల్స్ సర్వేను సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పర్యవేక్షించాలి. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రిదేవి ఉత్తర్వులు జారీచేశారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు.

అన్ని గ్రేడ్లకూ మంచి ధరలు ఇవ్వాలి

పొగాకు వ్యాపారులకు బోర్డు ఆర్ఎం సూచన



వ్యాపారులు, రైతులకు సూచనలిస్తున్న బోర్డు ఆర్ఎం

టంగుటూరు, ఆగస్టు 5 : పొగాకులో అన్ని గేడ్లకు మంచి ధరలు ఇవ్వాలని వ్యాపారులకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు సూచించారు. సోమవారం ఆయన స్థానిక వేలం కేంద్రాన్ని సందర్శించారు. వేలానికి వచ్చిన వివిధ రకాల బేళ్లు, వాటికి వ్యాపారులిస్తున్న ధరలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కొనుగోలుదారులనుద్దేశించి మాట్లాడుతూ మీరిచ్చే ధరలు రైతులకు లాభదాయకంగా ఉండాలన్నారు. పొగాకు వేయడానికి ముందు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, నువ్వు సాగుచేయడం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందని రైతులకు సూచించారు. ఇది లాభాలు తెచ్చిపెడుతుందన్నారు. అనధికారంగా బారన్లు నిర్మించవద్దని, అది చట్టరీత్యా నేరమన్నారు. వచ్చే సీజన్‌లో పొగాకు సాగుకు పొలాలు, బారన్‌లు అధిక కౌళ్లు చెల్లించి తీసుకోవద్దన్నారు. మున్ముందు మార్కెట్ ఎలా ఉంటుందో ఎవ్వరికీ తెలియదన్నారు. ఇప్పుడు లభిస్తున్న ధరలు ఏటా ఉంటాయన్న నమ్మకం లేదన్నారు. బోర్డు అనుమతికి మించి పంట సాగు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు పోతుల నరసింహారావు, పమిడి సుబ్బానాయుడు, మర్రిపూడి హరిబాబు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా నారు విక్రయిస్తే చర్యలు

ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష హెచ్చరిక



మిరప నర్సరీని పరిశీలిస్తున్న ఉద్యావనశాఖ అధికారి ప్రత్యూష

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 5 : లైసెన్స్ లేకుండా నారు విక్రయించే నర్సరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యానశాఖాధికారి డి.ప్రత్యూష హెచ్చరించారు. యజమానులు నర్సరీలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. సోమవారం ఆమె మండలంలోని వర్ధినేనివారిపాలెంలో మిరప నారు నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నర్సరీల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దానివల్ల చీడపీడలు ఆశించవన్నారు. నారు విక్రయించేటప్పుడు రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని కోరారు. నర్సరీ పేరు, మొక్కల ధరలు కనిపించేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తమశాఖ ద్వారా పండ్ల, పూలతోటలు, కూరగాయల సాగుకు రాయితీలు అందిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు ఆర్‌బీకేల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యూష కోరారు.

అమృత పథకంపై కదలిక

అన్ని ప్రాంతాలకూ నీటిని అందించలేకపోతున్న దర్శి ఎస్ఏపీ

ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోని పాలకులు

తాజాగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి చొరవతో కార్యాచరణ



దర్శి పట్టణం

దర్శి, ఆగస్టు 5 : దర్శి నగర పంచాయతీలోని ప్రజలకు రక్షిత మంచినీరు అందించే బృహత్తరమైన అమృత పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత పథకానికి ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వలన ఆ పథకం అడుగు ముందుకు పడలేదు. ఎన్నికల ముందు అప్పటి వైసీపీ పాలకులు హడావుడిగా శిలాఫలకం వేశారు. కానీ పనుల నిర్వహణ గురించి పట్టించుకోలేదు.

పులిపాడు చెరువు నుంచి పథకం అమలు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమృత పథకం నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. పులిపాడు చెరువును మంచినీటి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా అభివృద్ధి చేసి సాగర్ వాటర్ నింపుతారు. పైపులైన్ల ద్వారా దర్శి పట్టణంలోని ప్రజలకు తాగునీరు అందిస్తారు. అందులో భాగంగా పట్టణంలోని అన్నీ కుటుంబాలకు ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేస్తారు.

దర్శితోపాటు 120 గ్రామాల ప్రజలకు మేలు

అమృత పథకం నిర్మాణం పూర్తయితే దర్శి ప్రాంతంలోని ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోనుంది. ఒక్క దర్శి పట్టణంలోనే సుమారు 14వేల కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 88 వేల మంది జనాభా ఉన్నారు. ఇప్పటి వరకు దర్శి ఎస్ఏపీ రక్షిత మంచినీటి పథకం ద్వారా 120 గ్రామాలతో పాటు దర్శి పట్టణానికి మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఎస్ఏపీ చెరువు పూడిపోవటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో అన్నీ గ్రామాలకు మంచినీరు సక్రమంగా అందించలేకపోతున్నారు. ఒక్కోసారి దర్శి పట్టణంలోని శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు సక్రమంగా అందటం లేదు. అమృత పథకం నిర్మాణం పూర్తయితే నూతనంగా నిర్మించే చెరువు ద్వారా పట్టణ ప్రజలకు సమృద్ధిగా నీరు అందించే అవకాశం ఉంటుంది. దీంతో ఎస్ఏపీ స్కీం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు కూడా సమృద్ధిగా మంచినీరు అందించే వీలు కలుగుతుంది. బహుళ ప్రయోజనాలు కలుగుతున్న అమృత పథకాన్ని వైసీపీ పాలకులు పక్కన పడేయటం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. దీంతో దర్శి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలుగుతుంది.

సర్టిఫికేట్లు

నకిలీ ధ్రువపత్రాలకు కేరాఫ్ మార్కాపురం మున్సిపాలిటీ

జేబులు నింపుకొంటున్న జనన, మరణ ధ్రువీకరణ విభాగం

పుష్కలంగా వైసీపీ నేతల అండదండలు

ఫిర్యాదు అందినా పట్టించుకోని ఉన్నతాధికారులు

భారీగా కూడబెట్టిన అక్రమార్కులు

మార్కాపురంలో చేయి తడిపితే క్షణాల్లో మంజూరు

మార్కాపురం, ఆగస్టు 5: మార్కాపురం మున్సిపాలిటీలోని జనన, మరణ ధ్రువపత్రాలు జారీచేసే విభాగం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రూ.లక్షల్లో వసూలు చేస్తూ ఇష్టారీతిన నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటం, అన్నిస్థాయిల అధికారుల సహకారం తోడవడంతో మున్సిపాలిటీ నకిలీ ధ్రువపత్రాలకు కేంద్ర బిందువుగా మారింది. చివరికి మరీ బరితెగించి మార్కాపురంతో సంబంధంలేని ప్రాంతాల వారికి కూడా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వందల సంఖ్యలో ఇలా నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసేశారు. అప్పట్లో ఫిర్యాదులు అందినా పట్టించుకున్న నాథుడే లేడు.

ఇతరుల ఆస్తులు కొట్టేసేందుకే..

మార్కాపురం మున్సిపాలిటీలో ఇలా ఇష్టారీతిన జారీచేసిన జనన, మరణ ధ్రువపత్రాలు పొందిన వాళ్లు ఇతరుల ఆస్తులు కొట్టేసేందుకే ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలోనే మార్కెట్లో రూ.వందల కోట్ల ఆస్తులను నకిలీ ధ్రువీకరణ పత్రాలను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఇలా విచ్చలవిడిగా ధ్రువ పత్రాలు జారీ కావడానికి ప్రధాన కారణం అప్పటి నియోజకవర్గ ప్రజాప్రతినిధి సోదరుని ప్రమేయమేనని స్పష్టమవుతోంది. ఆయన సాగించిన భూదందాలు అన్నీ ఇన్నీ కావు. భూవివాదాలు, విలువైన స్థలాలు ఉండి మార్కాపురంలో లేనివారిని లక్ష్యంగా చేసుకుని ఇలా తప్పుడు పత్రాలు సృష్టించి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామ-వార్డు సచివాలయ శాఖ
APGSWS AB 6284390
GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF MUNICIPAL ADMINISTRATION
MEDICAL & HEALTH DEPARTMENT
DEATH CERTIFICATE



తప్పుడు ధ్రువీకరణ పత్రం, మార్కాపురం మునిసిపాలిటీ కార్యాలయం

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలా వందల సంఖ్యలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీచేసి రూ.లక్షల్లో సంబంధిత ఉద్యోగులు గడించారు.. ఇంకా ఇస్తునే ఉన్నారు కూడా. ఇందుకోసం పెద్ద ఎత్తున వ్యవహారాలు నడుస్తున్నాయి. అక్రమార్కులకు రాజకీయ పలుకుబడి ఉంది. దీంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు మున్సిపాలిటీలో నడుస్తోంది. ఎన్ని ఫిర్యాదు వచ్చినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడమే వారికి కలిసొచ్చింది.

తమ్మిరెడ్డి పెద్దిరెడ్డి అనే వ్యక్తిది కనిగిరి పట్టణం. ఈయన 1975లో మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన బతికుండగానే ఆస్తులు అమ్మేశాడు. కానీ ఆయన పేరును ఉపయోగించుకుని వారి బంధువులకు సంబంధించిన ఓ ఆస్తిని కొట్టేయాలని కనిగిరికి చెందిన ఓ వైసీపీ నాయకుడు యోచించాడు. అనుకున్నదే తడవుగా పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు కొంతమేర ముట్టజెప్పాడు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించేందుకు కొందరు అధికారులతో సంప్రదించాడు. మరణ ధ్రువీకరణ పత్రం కావాలంటే మార్కాపురంలో చిటికెలో లభిస్తుందని తెలుసుకున్నాడు. జనన, మరణ ధ్రువపత్రాలు జారీచేసే అధికారితో మాట్లాడాడు. పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇంకేముంది 1981 జూన్ 10న మరణించినట్లు 2023 నవంబర్ 15న ధ్రువీకరణపత్రం తయారైంది. కానీ ఇక్కడే కొన్ని పొరపాట్లు చోటుచేసుకున్నాయి. డెత్ సర్టిఫికెట్‌లో నమోదు సంఖ్య 109 అని ఉండగా, జనన, మరణాలను నమోదు చేసే రికార్డులో మాత్రం 90 ఉంది. అంతేకాక అప్పట్లో మరణ సమాచారం ఇచ్చిన వ్యక్తిగా చెబుతున్న వి.వెంకటేశ్వరరెడ్డి మరణించిన వ్యక్తికి మనవడు. సమాచారం ఇచ్చారని చెబుతున్న 1981లో ఆయనకు నాలుగేళ్లు ఉంటాయి. ఈ విషయంపై పెద్దిరెడ్డి బంధువులు కొందరు సమాచారహక్కు చట్టం ద్వారా సాక్ష్యాధారాలు సేకరించి ఇప్పటికే కలెక్టర్, సబ్‌కలెక్టర్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు.

మద్దెల వెంకటరత్నం వ్యక్తిది పూర్వం మార్కాపురం పట్టణమే. ఆయనకు భార్య మినహా పిల్లలు ఎవరూ లేరు. 1970 ప్రాంతంలో మార్కాపురం నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ ఉన్నారో కూడా బంధువులతోపాటు ఎవరికీ తెలియదు. కానీ ఈయన పేరున మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా సర్వే నెంబర్ 889లో సుమారు 25సెంట్ల భూమి ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఎంతలేదన్నా రూ.10కోట్ల విలువ చేస్తుంది. ఆ 25 సెంట్లు మినహా చుట్టూ ఉన్న మొత్తం భూమిని ఓ వైసీపీ ముఖ్య నాయకుడు ఆయన అనుచరులు కొన్నారు. పనిలో పనిగా వెంకటరత్నం భూమిని ఆక్రమించారు. ఆక్రమణ అయితే చేశాం కానీ ఓ దొంగ రిజిస్టర్ కూడా చేయించుకుంటే లీగల్‌గా ఉంటుందని ప్రణాళిక రచించారు. ఈక్రమంలో అదే ఇంటిపేరు కలిగిన మద్దెల ప్రసాద్ అనే వ్యక్తిని మాట్లాడుకున్నారు. ప్రసాద్ తండ్రి అంపయ్య అయితే వెంకటరత్నంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో మార్పించారు. అంతేకాక వెంకటరత్నం పేరున ఓ దొంగ మరణ ధ్రువీకరణ పత్రాన్ని కూడా సృష్టించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా 10-345 అనే ఇంటి చిరునామాతో వెంకటరత్నం 1987 మే 25న మరణించినట్లు 2020 డిసెంబర్ 26న సర్టిఫికెట్ పొందారు. అందుకు భారీ మొత్తంలో చేతులు మారినట్లు తెలుస్తోంది.

విచారణలతోనే సరి.. చర్యలు శూన్యం..

నకిలీ ధ్రువపత్రాల విషయంపై జిల్లాలోని అన్నిస్థాయిల అధికారులకు ఫిర్యాదులు అందాయి. కానీ నేటికీ విచారణలతోనే అందరూ సరిపెడుతున్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులు ఎవరో తేల్చి వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్ని ఫిర్యాదులు అందినా కేవలం విచారణలతోనే ఉన్నతాధికారులు సరిపెడుతున్నారు. కనిగిరికి చెందిన తమ్మినేని సాయిసీలేష్‌రెడ్డి నకిలీ ధ్రువపత్రాలపై ఇప్పటికే కలెక్టర్, మార్కాపురం సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశాడు. అయినా చర్యలపై మాత్రం చలనం లేదు.

సింగరాయకొండలో అక్రమాలపై విచారణ

రూ.40లక్షలకుపైగా నిధులు దారిమళ్లించినట్లు ఆరోపణలు

ఏడాది క్రితం విచారణ చేసినా నివేదిక

ఇవ్వకపోవడంపై ఇద్దరు డీఎల్‌పీఓలకు నోటీసులు

సర్పంచ్ చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు

డీఎల్‌పీఓ, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ సిగ్నేచర్

ఈనెల 9న విచారణకు హాజరుకావాలని

పలువురికి నోటీసులు ఇచ్చిన విచారణాధికారి



సింగరాయకొండ పంచాయతీ కార్యాలయం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : మండలకేంద్రమైన సింగరాయకొండ గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలను నిగ్గుతేల్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. గతేడాది కాలంగా పంచాయతీలో నిధులు పెద్దఎత్తున నిధులను దారిమళ్లించినట్లు అనేక ఆరోపణలు వచ్చినా అప్పట్లో పట్టించుకున్న పరిస్థితి లేదు. గ్రామపంచాయతీకి సంబంధించిన నిధులను కార్యదర్శులతో కుమ్మక్కై రూ.46లక్షలకుపైగా దారిమళ్లించారని సింగరాయకొండ జనసేన పార్టీ అధ్యక్షుడు రాజేష్ ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇటీవల మరోసారి రాజేష్ మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అందుకు సంబంధించిన విచారణ నివేదికలను అందజేయాలని ఆదేశించారు. అయితే సింగరాయకొండ గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణకు ఒంగోలు, కనిగిరి డివిజనల్ పంచాయతీ అధికారులను విచారణాధికారులుగా నియమించారు. అయితే వారు విచారణ చేసినా ఏడాది కాలంగా ఆ నివేదికను అందజేయకపోవడంతో మరోసారి వారి ఇరువురికి నోటీసులను ఇచ్చారు.

సర్పంచ్‌పై చర్యలు

మరోవైపు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ టి.వనజకు తాత్కాలికంగా చెక్‌పవర్‌ను వారంరోజులపాటు నిలుపుదల చేస్తూ సోమవారం డీపీఓ ఉషారాణి ఉత్తర్వులు జారీచేశారు. వారంరోజుల్లో వివరణ ఇవ్వకపోతే పూర్తిగా చెక్‌పవర్‌ను రద్దుచేయాల్సి వస్తోందని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఒకవైపు జిల్లా పంచాయతీ అధికారులు చర్యలకు ఉపక్రమించగా మరోవైపు కలెక్టర్ తమీమ్ అన్సారియా నిధుల దుర్వినియోగంపై నిగ్గుతేల్చేందుకు విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ ప్రత్యేక అధికారిని విచారణాధికారిగా నియమించడంతో ఆయన విచారణ చేసేందుకు పంచాయతీ సర్పంచ్‌తో పాటు గతంలో పనిచేసిన ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఈనెల 9వతేదీన ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపారు. 2021 డిసెంబరు నుంచి జూన్ 2022 మధ్యకాలంలో పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి వస్తువులు కొనుగోలు చేయకుండా సాధారణ నిధుల నుంచి రూ. 13లక్షలు బిల్లులు డ్రా చేశారని ఆ నోటీసులు పేర్కొన్నారు. పంచాయతీలో పనులు చేయకుండానే చేసినట్లుగా రికార్డులు సృష్టించి 15వఆర్థిక సంఘంనిధులు రూ.33లక్షలు స్వాహా చేసినట్లు ఫిర్యాదులు రావడంతో వాటిపై సమగ్ర సమాచారంతో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీచేయడంతో కలకలం రేగింది.

ఉప్పుగుండూరు సర్పంచ్ చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు సర్పంచ్ దేవరకొండ జయమ్మ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ డీపీఓ ఉషారాణి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ పంచాయతీలో రూ.42,70,666 దుర్వినియోగమైనట్లు కె.శ్రీనివాసరావు అనే వ్యక్తి డీపీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణాధికారిగా నియమించారు. అయితే ఆ విచారణ నివేదిక జాప్యం కావడంతో సోమవారం ఫిర్యాదుదారుడు జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. దీంతో స్పందించిన అధికారులు సర్పంచ్ జయమ్మ చెక్ డ్రాయింగ్ పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వారంరోజుల్లో సర్పంచ్ సంజాయిషీ ఇవ్వకపోతే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చెక్ పవర్‌ను పూర్తిగా తొలగిస్తామని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు. డీఎల్‌పీఓ నివేదికలోని సిఫార్సుల మేరకు పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీపీఓ ఉషారాణి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



లింగంపల్లి గోపీ, గోలి వేణు

మంగళగిరి సిటీ, ఆగస్టు 5: మంగళగిరి పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మంగళగిరి పట్టణ ఎస్ఐ బి.రవీంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చీరాల మండలం తోటవారిపల్లె గ్రామానికి చెందిన గోలి వేణు(23), లింగంపల్లి గోపీకృష్ణ(25) స్నేహితులు. గోపీకృష్ణ స్వర్ణకార వృత్తి నేర్చుకునే నిమిత్తం సుమారు ఇరవై రోజుల నుంచి మంగళగిరిలోని బంధువుల వద్ద వుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో గోపీకృష్ణను కలిసేందుకు వేణు తోటవారిపల్లె నుంచి వచ్చాడు. ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం చినకాకాని నుంచి మంగళగిరి పట్టణంలోకి వస్తున్నారు. ఎర్రచెరువు కాళీమాత ఆలయం ఎదురుగా వున్న మలుపు వద్దకు రాగానే రోడ్డుపై ఆవులు అడ్డుపడ్డాయి. వాటిని తప్పించబోయి బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో వేణు, గోపీకృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేణు తండ్రి గోలి రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

తోటవారిపాలెం(చీరాలటౌన్) : వారిద్దరిది ఒకేమాట. ఒకే బాట. అన్ని వేళల్లోనూ ఎంతో కలిసి మెలిసే ప్రయాణం. దేవుడు సైతం వారిద్దరినీ కానరాని లోకాలకు కలిసే పంపాడు. చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ వీవర్స్ కాలనీకు చెందిన లింగంపల్లి గోపీ(23), గోలి వేణు ప్రాణ స్నేహితులు. వీరిద్దరికీ మంగళగిరిలో మరో మిత్రుడి వద్దకు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు వెళ్లి మృత్యువాతపడ్డారు. గోపి తల్లి కోవిడ్‌తో మృతి చెందింది. తండ్రి రంగారావు పుట్టు మూగ. మూగ తండ్రికి నాయనమ్మకు అండగా ఉంది. గోపీ మరణం ఆ కుటుంబానికి తీరని లోటు. వేణుకు తండ్రి లేరు. తల్లి రమాదేవి చేనేత కార్మికురాలు. వీరు ముగ్గురు అన్నదమ్ములు. కాగా వేణు పెద్దవాడు. పెయింట్ పని చేస్తూ తల్లికి అండగా ఉంటున్నాడు.

ఆస్తి వివాదాలు.. ప్రైవేటు పంచాయితీలు

అక్రమార్కులకు అండగా ఉండం

ఎమ్మెల్యే కొండయ్య స్పష్టీకరణ



స్థల వివాదంలో తలపడుతున్న ఇరు వర్గాలు

చీరాల, ఆగస్టు 5 : ప్రశాంత వాతావరణం కల్పిస్తాం. అందరికీ అండగా ఉంటాం. అభివృద్ధిలో పోటీ పడదాం. అరాచక శక్తులపై ఉక్కుపాదమం మోపుదామంటూ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పదేపదే చెప్తున్న మాటలు. ఆయన వరకు ఆ పద్ధతిని కొనసాగిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే కొండయ్య పేరు చెప్పుకుని కొందరు వ్యక్తులు పైరవీలు, ప్రైవేటు పంచాయతీలను సాగిస్తున్నారు. తాము ఎమ్మెల్యే కొండయ్యకు అనధికారిక పీఏలమని చెప్పేవారు కొందరైతే.. ఆయన అంతరాత్మలమని చెప్పేవారు మరికొందరున్నారు. ఆయన సొంత మనుషులమని చెప్పేవారున్నట్లు అటు అధికారులు, ఇటు రాజకీయవర్గాలతో పాటు, ప్రజల్లో చర్చ సాగుతోంది. ఆ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య సదరు వ్యక్తుల పద్ధతి మార్చుకోమని హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలావుంటే వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ శ్రీనివాసకాలనీలో ఆదివారం ఓ స్థల వివాదంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఓ స్థలంలో ఒకరు గోడ కట్టించగా, రెండో వర్గం ఆ గోడను తొలగించారు. దీంతో ఇరువర్గాల మధ్యా వాగ్వివాదంతోపాటు ఒకరి పైమరొకరు చేయి చేసుకున్నారు. ఈ ఘటన వీడియో వైరల్ అయింది. ఆ వివాదంలో సస్పెండ్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆ స్థలం తనపేరుపై ఉందని చెప్తుండగా, అవతలివారు తమదంటూ వాదనకు దిగారు. ఆ కానిస్టేబుల్ ఎమ్మెల్యే కొండయ్యకు సన్నిహితుడని ప్రచారం ఉంది. దీనిపై కొత్తపేట వీఆర్వోను వివరణ కోరగా.. సదరు వివాదం తన దృష్టికి రాలేదన్నారు. వైరల్ అవుతున్న వీడియోపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు.

నా పేరు చెప్పుకుని అరాచకాలకు పాల్పడితే ఉపేక్షించను

- ఎమ్మెల్యే కొండయ్య

సేవ చేసేందుకే వచ్చా. చీరాల నియోజవకర్గంలో గతంలో జరిగిన పాలనకు భిన్నంగా ప్రజలకు మంచి చేయడమే నా లక్ష్యం. ఎన్నికలలో ఎంతోమంది నా కోసం పనిచేశారు. అందుకు వారికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు. ఈ నేపథ్యంలో నా పేరు చెప్పి అరాచకాలకు, అన్యాయాలకు పాల్పడివారెవరైనా ఉపేక్షించేంది లేదు. ఆయా శాఖల అధికారులు తమ రూల్ పొజిషన్ ప్రకారం చర్యలు తీసుకోండి. వారిపై తనవైపు నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదు.



పర్చూరు - ఇంకొల్లు రోడ్డు భారీ గుంతల్లో నిలచి ఉన్న వర్షపు నీరు

ప్రధాన రహదారిపై భారీ గుంతలు

» వాహనదారుల ఇక్కట్లు » తరచూ ప్రమాదాలు

పర్చూరు, ఆగస్టు 5 : నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే పర్చూరు - ఇంకొల్లు (పాతమద్రాసు రోడ్డు) అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలే కన్పిస్తున్నాయి. రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతిని గుంతలయినా పట్టించుకున్న దాఖలాలే లేవు. జగన్‌రెడ్డి పాలనలో ఐదేళ్లపాటు రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం చూపారు. దీంతో రహదారులు ధ్వంసమయ్యాయి. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుమీద ఉన్న గుంతలు వర్షపు నీటితో నిండిపోవడంతో గుర్తించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఇంకొల్లు వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారింది. వెంటనే రోడ్లను బాగుచేయాలని వేడుకుంటున్నారు.

తాగునీటి సమస్య తీరేనా..?

» గుండ్లకమ్మ నదికి వచ్చిన ప్రవాహం
» వారంరోజులుగా అరకొర సరఫరా



గుండ్లకమ్మ నదిలో అద్దంకి సమీపంలో ప్రవహిస్తున్న నీరు

అద్దంకి, ఆగస్టు 5 : అద్దంకి పట్టణవాసులు ఈ ఏడాదికి తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వారంరోజులుగా అద్దంకి పట్టణంలో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగా ఉంది. గుండ్లకమ్మ నదిలోని ఊటబావుల వద్ద నీటి లభ్యత లేకపోవడంతో ట్యాంక్‌లకు అరకొరగానే నీటి పంపింగ్ జరుగుతోంది. దీంతో పట్టణంలోని అత్యధిక ప్రాంతాలకు నీటి సరఫరా అంతంత మాత్రంగానే జరుగుతుంది. ఈ నేపథ్యంలో గుండ్లకమ్మ నది ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు తోడు సాగర్ నీరు తాగునీటి చెరువులు నింపేందుకు విడుదల కావడంతో ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న సీపేజ్ వాటర్ గుండ్లకమ్మ నదికి చేరి సోమవారానికి కొద్దిమేర అద్దంకి వద్దకు నీటి ప్రవాహం వచ్చింది. దీంతో ఊటబావుల వద్దకు నీటి లభ్యత పెరిగింది. అయితే గుండ్లకమ్మ నదిలో నీరు సోమవారం రంగుమారి వస్తుండడంతో సోమవారం నీటి పంపింగ్ చేయలేదు. మంగళవారం నుంచి నీటి పంపింగ్ పూర్తి స్థాయిలో చేసి నీటి విడుదల చేయడం జరుగుతుందని మున్సిపల్ ఏఈ మరియదాసు తెలిపారు. సాగర్ డ్యామ్ కూడా పూర్తి స్థాయిలో నిండడంతో సాగర్ కాలువ లకు సాగునీటికి నీటి విడుదల జరుగుతుండడంతో గుండ్లకమ్మ నదిలో ఇక నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఉండవు. దీంతో అద్దంకి పట్టణ ప్రజలకు కూడా తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో జరిగే అవకాశం ఉంది.



తహసీల్దార్‌ను అభినందిస్తున్న కార్యాలయ ఉద్యోగులు

తహసీల్దార్‌గా కవిత బాధ్యతల స్వీకరణ

బల్లికురవ, ఆగస్టు 5 : బల్లికురవ తహసీల్దార్‌గా డీ కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయం నుంచి కవితను ఇక్కడకు బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ నుంచి కవిత బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలతో తహసీల్దార్ కవిత మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించిన పెండింగ్ పనులు లేకుండా అందరూ సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. బాధ్యతతో ఎక్కడా లోపాలు లేకుండా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం నూతన తహసీల్దార్‌ను ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో అమరనాథ్, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆశోక్, వీరయ్య, వాసు, వెంకటేశ్వర్లు, మీనా పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా విధులు చేపట్టిన నాగరాజారావు



నాగరాజారావుకు శుభాకాంక్షలు చెప్తున్న ఉద్యోగులు

పంగులూరు, ఆగస్టు 5 : పంగులూరు తహసీల్దార్‌గా డీ నాగరాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి నుంచి జె.పంగులూరు తహసీల్దార్‌గా ఇక్కడకు బదిలీపై వచ్చారు. నాగరాజారావును కార్యాలయ డీటీ ఆదినారాయణ, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పోలేరమ్మ గుడిలో వెండి తాళిబొట్టు చోరీ

బల్లికురవ, ఆగస్టు 5 : మండలంలోని గుంటుపల్లి పోలేరమ్మ గుడిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అమ్మవారి మెడలో ఉన్న వెండి తాళిబొట్టు తాడును చోరీ చేశారు. నెల రోజుల వ్యవధిలో ఈ గుడిలో ఇది రెండో దొంగతనమని ధర్మకర్త మాదాల వీరమ్మ తెలిపారు. గత నెలలో హుండీని పొలాల్లో పడవేసి వెళ్లారని ఆమె తెలిపారు. రోడ్డు ప్రక్కనే దేవాలయం ఉండడంతో దొంగలు రాత్రుల వేల చోరీకి పాల్పడుతున్నారని ప్రజలు తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు వస్తున్నారన్నారు. ఏడాది కిందట గ్యాస్ సిలిండర్లను దొంగిలించారని తెలిపారు. పోలీసులు గ్రామాలలో నైట్ బీట్ తిరిగి చోరీలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులను ఇవ్వాలి

మార్టూరు, ఆగస్టు 5 : మండలంలోని కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులను ఇచ్చేవిధంగా కృషి చేయాలని రైతు సంఘాల నాయకులు సోమవారం తహసీల్దార్ టి.ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఐదేళ్ల నుంచి వివిధ కారణాలతో కౌలు రైతులకు అధికారులు గుర్తింపుకార్డులను ఇవ్వలేదని తెలిపారు. తద్వారా పంట నష్టం జరిగినప్పుడు, రాయితీపై ఎరువులు పంపిణీ చేసినప్పుడు వారు ప్రయోజనం పొందలేకపోయారని తెలిపారు. భూయజమానులు కౌలుదారులకు అంగీకారపత్రాలు ఇవ్వకపోవడంతో కూడా కౌలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. జంగమహేశ్వరపురం, లక్కవరం గ్రామాల పరిధిలో ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న ఇనాం భూములపై రైతులకు హక్కులు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు,వీరవల్లి కృష్ణమూర్తి, వెలగా మోహనరావు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాతలు

యోగాలో చందులూరు విద్యార్థుల సత్తా

పంగులూరు, ఆగస్టు 5 : యోగాసన పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల బాల, బాలికలు సత్తాచాటి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యోగా పోటీలలో వివిధ విభాగాలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథములుగా నిలిచారు. ఈ నెల 4వ తేదీన ఒంగోలు పీవీఆర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీలలో 10 నుంచి 12 సంవత్సరాల విభాగంలో అమ్మిశెట్టి లిఖిత ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. 12 నుంచి 14 సంవత్సరాల యోగాసన పోటీలో బాలికల విభాగంలో నాయపాము శృతి ప్రథమ స్థానం దక్కించుకోగా, బాలుర విభాగంలో అమ్మిశెట్టి వెంకటేష్ జిల్లా స్థాయిలో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం గిరిజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామపెద్ద అడ్డగడ వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు ప్రతిభ చాటిన క్రీడాకారులతో పాటు వారికి యోగాలో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయిని ప్రతిమను అభినందించారు.

రైతులకు 9 గంటల కరెంట్

ఈఈ మస్తాన్‌రావు



రైతులతో మాట్లాడుతున్న అద్దంకి డీవిజన్ ఈఈ మస్తాన్‌రావు, డీఈఈ సురేంద్రబాబు

బల్లికురవ, ఆగస్టు 5 : పంటలు సాగు చేస్తున్న రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను 9 గంటల పాటు అందిస్తామని ఎక్కడైనా లోపాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యుత్ శాఖ అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం బల్లికురవ సబ్‌స్టేషన్ ఆవరణలో మార్టూరు డీఈఈ ఎం.సురేంద్రబాబు, మండల ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు వ్యవసాయ విద్యుత్ లైన్ల సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కొన్ని చోట్ల తీగలు నేలజారి ఉన్నాయని కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ కాగా, కొత్తవి రాలేదని, కొన్ని చోట్ల డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా కొత్త లైన్లు ఏర్పాటు చేయలేదని కొందరు వ్యవసాయ విద్యుత్ లైన్లు మర్మతులకు గరవుతున్నాయని ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మస్తాన్‌రావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో గ్రామాలలో విద్యుత్ లైన్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామన్నారు. రైతులు కూడా తమకు సహకరించాలన్నారు. కొన్ని గ్రామాలలో ఇప్పటికే ప్రత్యేక త్రిఫేజ్ విద్యుత్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం సిబ్బందికి ఎవరూ నగదు ఇవ్వాల్సిన పని లేదన్నారు. వరుస క్రమంలో డీడీలు చెల్లించిన రైతులకు వ్యవసాయ లైన్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఎక్కువయ్యాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాలకు ఇప్పటికే రెండు సార్లు వేలం

శింగరకొండ దేవస్థానం ఈవో సుభద్ర

అద్దంకి, ఆగస్టు 5 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద దాతల సహకారంతో నిర్మించిన దుకాణాలలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఇప్పటికే రెండు సార్లు టెండర్‌లు పిలిచి వేలంపాటలు నిర్వహించామని దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన అధికారుల నిర్లక్ష్యం కథనంపై ఈవో సుభద్ర వివరణిచ్చారు. దేవాలయం పునఃనిర్మాణంలో ఉన్నందున దుకాణాలు అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదని, అయినప్పటికీ దేవస్థానం తరపున ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం ఎదురుగా అనధికారికంగా వ్యాపారం నిర్వహించే వ్యక్తులు, తోపుడు బండ్లు నిర్వహించే వారిని తొలగించాలని పోలీస్‌లకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంకా తొలగించలేదని తెలిపారు. దేవస్థానానికి సంబంధించిన షాపులలో పూజా సామగ్రి ఎక్కువ ధరలకు అమ్మకాలు చేయడంపై ఇంత వరకు ఎలాంటి లిఖిత పూర్వక ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామికి పూజలు

దర్శించుకున్న న్యాయాధికారి శాంతి



పూజలు నిర్వహిస్తున్న న్యాయాధికారి శాంతి

చెరుకూరు(పర్చూరు), ఆగస్టు 5 : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ ఆగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. జూనియర్ న్యాయాధికారి బీ శాంతి కుటుంబ సభ్యులతో స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.నాగయ్య నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మినీ బైపాస్ కోసం ఆక్రమణలు తొలగించాలి



తహసీల్దార్ శ్రీచరణ్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న రమేష్, నాగరాజు

అద్దంకి, ఆగస్టు 5 : అద్దంకి పట్టణంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఆక్రమణలను తొలగించాలని పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తహసీల్దార్ శ్రీచరణ్‌ను కోరారు. తహసీల్దార్‌గా శ్రీచరణ్ బాధ్యతలు చేపట్టగా సోమవారం పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, 19వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణంలోని పలు సమస్యల గురించి వివరించారు.

సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

చీరాలటౌన్, ఆగస్టు 5 : చీరాల వన్‌టౌన్ సీఐగా మారీడు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈక్రమంలో పలువురు స్టేషన్ సిబ్బంది సీఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా ఉన్న శేషగిరిరావుకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సీఐల బదిలీలు ఉన్నప్పటికీ ఆయన ఇక్కడే ఉంటారని అనుకున్నారు. ఆయన్ని వీఆర్‌కు పంపడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. శ్రీనివాసరావు ముక్కు సూటిగా ఉంటారని, గతంలో శౌర్య పతాకం అందుకున్నట్లు సమాచారం.

తల్లి పాలతో వ్యాధినిరోధక శక్తి

బల్లికురవ, ఆగస్టు 5 : తల్లి పాలు తాగిన బిడ్డల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీవో సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొప్పెరపాడు సెక్టార్ పరిధిలో ఉన్న 20 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లులకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సీడీపీవో సుధ మాట్లాడుతూ ముర్రు పాలు బిడ్డకు మెదటి టీకా అన్నారు. క్రమం తప్పకుండా ఆరు మాసాల తల్లి పాలు తాగించడం వలన పిల్లలు ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. అనంతరం పిల్లలకు పాలు పట్టిస్తామంటూ తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సలోమి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు



హాలును పరిశీలిస్తున్న జేసీ సుబ్బారావు తదితరులు

ఫంక్షన్ హాలును పరిశీలిస్తున్న జేసీ

చీరాల, ఆగస్టు 5 : జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో ఈనెల 7వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు చీరాలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని జాండ్రపేట ఫంక్షన్ హాలును సోమవారం జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి డీఎస్పీ జగదీష్‌నాయక్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఆగస్టు 5 : చీరాల పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కె.రఘు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. పీజీ, ఎంబీఏ, బీటెక్, డిగ్రీ, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అభ్యర్థులు నేరుగా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9866 822 697, 87907 90762 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ ప్రతినిధులు

శ్రీకృష్ణుడు అవతార పురుషుడు

పంగులూరు, ఆగస్టు 5 : దేవుడే మనిషిగా రూపంలో వచ్చిన అవతార పురుషుడు శ్రీకృష్ణ భగవానుడని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు మడియం పెద్దరెడ్డి అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి పాధాన్యతలను వివరిస్తూ నరసరావుపేటకు చెందిన ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు సోమవారం మండలంలోని పంగులూరు, కొండమూరు, బైటమంజులూరు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కాటం పోతురాజు, చల్లగుండ్ల భాస్కరరావు, కుంచాల చిన వెంకయ్య, కోపూరి వెంకటేశ్వర్లు, అశోక్, అమరలింగయ్య రాజశేఖర్ పాల్గొన్నారు.

అమ్మ ఆశ్రమానికి విరాళం

మార్టూరు, ఆగస్టు 5 : అమ్మ ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య రూ.25వేల విరాళాన్ని సోమవారం ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయుడు ఊర మస్తానయ్య సుబ్బాయమ్మ దంపతు ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

జోరుగా చిత్తు బొమ్మ ఆట

వలపర్లలో అర్ధరాత్రి యువకులు పందేలు

మార్టూరు, ఆగస్టు 5 : వలపర్ల గ్రామంలో సినిమా హాలు సెంటర్ సమీపంలో రాత్రి సమయంలో యువకులు జోరుగా చిత్తు బొమ్మ ఆట (జూదం) ఆడుతున్నారు. పదులు, వందలు స్థాయిలో ఆటలో పందేలు కాస్తున్నారు. ఈ సెంటర్ సమీపంలో సాయిబాబా గుడికి వెళ్లే దారిలో రోడ్డుపైన ఉన్న ప్రధాన ముఖద్వారం వద్ద రాత్రి 10 గంటల నుంచి ఆట మొదలవుతుంది. గ్రామంలోని ముఖ్యంగా రెండు సామాజిక వర్గాలకు చెందిన, ఈ ప్రదేశానికి సమీపంలోని కొంతమంది యువకులు జోరుగా ఆటలో మునిగితేలుతున్నారు. 20 రోజులుగా అర్ధరాత్రి దాటే వరకూ ఆట సాగుతున్నట్లు తెలిసింది. ఈ జూదంలో ఆడి యువకులు డబ్బులు పోగొట్టు కుంటున్నారు. ఆటకు వచ్చేవారంతా పేద, మధ్య తరగతివారే. ఇల్లు గడవడానికి మహిళలు కష్టపడుతుంటే యువకులు ఈ ఆటకు ఆకర్షితులై ఇంటిని గుల్ల చేస్తున్నారు. వేల వరకు పోగొట్టుకున్నట్లు సమాచారం. చేనేత కుటుంబానికి చెందిన వైసీపీ చెందిన యువకుడు జగన్ సీఎం అవుతారని రూ.45వేలు బెట్టింగ్‌లో పోగొట్టుకోగా, చిత్తుబొమ్మ ఆటలో రూ.50వేలు పోగొట్టుకున్నాడని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. కొందరు యువకులు తమ ద్విచక్రవాహనాలను, ఇంట్లో చిన్న చిన్న బంగారు, వెండి ఆభరణాలను తాకట్టు పెట్టి జూదం ఆడుతుండగా, ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. జూదాలకు అడుకట్ట వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీకి వెళ్లే రోడ్‌లో చెట్టు నీడన అరుగుపై పట్టపగలు జూదం ఆడుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

అద్దంకి, ఆగస్టు 5 : బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఈబీ ఎస్సై వి.సైమన్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులు అనే కథనంపై స్పందించిన ఎస్సై సైమన్ వివరణ ఇచ్చారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్‌షాపుల గురించి ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో సేల్స్‌మేన్‌లు, సూపర్‌వైజర్‌లు బెల్ట్ షాపులకు మద్యం అమ్మకాలు చేస్తే ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది ద్వారా దాడులు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



చిట్టిబాబు మృతదేహం

అద్దంకి, ఆగస్టు 5 : రోడ్డు ప్రమాదంలో రాజమండ్రి ప్రాంతానికి చెందిన కూలీ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన జె.చిట్టిబాబు (32), హరిబాబు అద్దంకి మండలం చక్రాయపాలెం వద్ద పొగనారు మళ్ల వద్ద పనిచేసేందుకు వచ్చారు. సోమవారం సాయంత్రం చ క్రాయపాలెం నుంచి అద్దంకి వచ్చేందుకు మోపెడ్‌పై నామ్ రోడ్డులో హైస్కూల్ వద్ద మలుపు తిరుగుతుండగా పిడుగురాళ్ల వైపు నుంచి అద్దంకి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిట్టిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. హరిబాబును 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు వాహనంలో ఒంగోలు తరలించారు.

ఇటుక బట్టీల వద్ద చోరీలు

రూ.1.50 లక్షల విలువైన ట్రాక్టర్ ట్రాలీ, బ్యాటరీలు మాయం



చోరీకి గురైన ట్రాక్టర్ బ్యాటరీ.. ట్రాక్టర్ ట్రాలీ (ఫైల్)

అద్దంకి, ఆగస్టు 5 : ఇటుక బట్టీల వద్ద సుమారు 1.50 లక్షల రూపాయల విలువైన ట్రాక్టర్ ట్రాలీ, ట్రాక్టర్‌లకు ఉన్న రెండు బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. బాధితుల కథనం మేరకు.. అద్దంకి పట్టణ పరిధిలో కలవకూరు రోడ్డులో ఉన్న దొప్పలపూడి ప్రసాద్‌కు చెందిన ఇటుక బట్టీల వద్ద నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఆటో కు కట్టుకొని తీసుకుపోయారు. అదే సమయంలో ట్రాక్టర్‌కు ఉన్న రెండు బ్యాటరీలను కూడా దొంగలించారు. మూడు రోజుల కిందట మరో ఇటుక బట్టీ వద్ద కూడా మూడు బ్యాటరీలు చోరీ అయ్యాయి. ఇటుక బట్టీల వద్ద కూలీలు లేకపోవడంతో దొంగతనాలు పెరిగినట్లు తెలుస్తుంది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దొప్పలపూడి ప్రసాద్ తెలిపారు.

పరస్పర కేసులు నమోదు

పర్చూరు, ఆగస్టు 5 : కారంచేడు పోలీసు స్టేషన్‌లో గ్రామ పంచాయతీకి సంబంధించి నెలకొన్న వివాదంలో ఇరు వర్గీయుల ఫిర్యాదుపై ఆదివారం రాత్రి పరస్పర కేసులు నమోదయ్యాయి. కారంచేడు సర్పంచ్ బాలిగ శివపార్వతి తనను కులంపేరుతో అసభ్యంగా వార్డు సభ్యులు పాతూరి ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ యార్లగడ్డ రత్తయ్యతోపాటు మరికొందరు దూషించారంటూ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పాతూరి ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ యార్లగడ్డ రత్తయ్య చౌదరిని సర్పంచ్ బాలిగ శివపార్వతి తోపాటు, మరికొంతమంది సర్పంచ్ వర్గీయులు అసభ్యంగా దూషించారంటూ ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదైంది. దీంతో ఇరువర్గీయుల ఫిర్యాదుపై రెండు వేరువేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహితపై ముగ్గురు యువకుల దాడి

చీరాల, ఆగస్టు 5 : మండల పరిధిలోని ఈపురుపాలెం పంచాయతీ బోయినవారిపాలెంకు చెందిన బోయిన పద్మ (38) అనే వివాహితపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దాడిచేసి గాయపరిచినట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఈ ఘటన ఆదివారం జరగ్గా బాధితురాలు తెలపడంతో సోమవారం వెలుగులోకి వచ్చింది. కొన్ని సంవత్సరాల క్రితం ఆమె భర్త మరణించారు. ఈ క్రమంలో తన నడవడిక సరిగా లేదంటూ గ్రామానికి కోటి మోహన్, వెంకటేశ్వర్లు, గోపి అనే ముగ్గురు తనపై ఆదివారం దాడిచేసి గాయపరిచారు. ఈపురుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తనకు న్యాయం జరగలేదని, పోలీసులే తనను బెదిరించారని ఆమె ఆరోపించారు. ఈ విషయమై ఈపురుపాలెం ఎస్సై శివకుమార్‌ను వివరణ అడగ్గా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఉదయం కేసు నమోదు చేశామన్నారు. సాయంత్రం బోయినవారిపాలెం వెళ్లి బాధితురాలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు.



బాధితురాలిని విచారిస్తున్న ఈపురుపాలెం ఎస్సై శివకుమార్